ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 109, పేజీలు - 08

సోమవారం,అక్టోబర్ 19, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు!

పండుగ వేళ సామాన్యుడికి ఖర్చుల సెగ

- పెరిగిన కూరగాయలు, ప్రియమైన పప్పులు, భారమైన పూజా సామగ్రి
- పండుగ చేసుకోవాలా? కుటుంబాన్ని పోషించుకోవాలా?
- ఆదాయం అంతంతే, ఖర్చులు కొండంత, ధరల నియంత్రణపై ప్రభుత్వాల నిర్లక్ష్యమెంత?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పండుగ వచ్చిందంటే ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి. కుటుంబ సభ్యులంతా కలిసి సంతోషంగా గడపాలి. సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు చేసుకోవాలి. పిల్లలకు కొత్త బట్టలు కొనాలి. బంధుమిత్రులకు తీపి పంచాలి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్య కుటుంబాలకు పండుగ అనగానే ఆనందంతో పాటు ఆర్థిక భారం కూడా గుర్తుకొస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ఖర్చులు, పూజా సామగ్రి, పండ్లు, పూలు, స్వీట్లు, దుస్తుల ధరలు కుటుంబ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. సంపాదనలో ఎక్కువ భాగం ఇంటి ఖర్చులకే సరిపోని పరిస్థితుల్లో పండుగ ఖర్చులను ఎలా భరించాలో తెలియక మధ్యతరగతి, పేద కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

వంటింటి బడ్జెట్‌కు ధరల మంటలు

నిత్యం అవసరమయ్యే బియ్యం, పప్పులు, వంటనూనెలు, పంచదార, పాలు, ఇతర సరుకుల కొనుగోలుకే కుటుంబాలు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనికి తోడు కూరగాయల ధరల్లో హెచ్చుతగ్గులు, పండ్లు, పూల ధరల భారం వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పండుగల సమయంలో కొనుగోళ్లు పెరుగుతుండటంతో కుటుంబాల ఖర్చులు మరింత విస్తరిస్తున్నాయి. ఏ వస్తువు కొనాలన్నా ధర అడిగితేనే సామాన్యుడి గుండెల్లో గుబులు పుడుతోంది.గతంలో కొంత మొత్తంతో పండుగకు అవసరమైన సరుకులన్నీ కొనుగోలు చేసేవారు. ఇప్పుడు అదే అవసరాల కోసం అదనపు డబ్బు వెచ్చించాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. ముఖ్యంగా రోజువారీ కూలీలు, చిరుద్యోగులు, చిన్న వ్యాపారులు, స్థిరమైన ఆదాయం లేని కుటుంబాలకు ధరల పెరుగుదల మరింత భారంగా

2లో..

ఓటు చోరీకి మోదీ ప్లాన్

– అమిత్ షా అమలు

- సీఈసీ ద్వారా కార్యరూపం దాల్చారన్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఓట్లచోరీకి పాల్పడుతున్న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ త్వరలోనే చట్టం ముందు నిలవాల్సి వస్తుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. వారు తమ తప్పులకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి 2కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన రాహుల్ జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరీకి పాల్పడుతుంటే మోదీ, అమిత్ షా ఆయనకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి అని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను పదిలిపెట్టేది లేదని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు.

2లో..

టామ్ కామ్ వ్యవహారంపై

సీఐడీ విచారణ జరిపించాలి

– టామ్కామ్ పై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టామ్కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70–75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా ఇంటర్వ్యూ

2లో..

ఫోర్ ఫాదర్స్' పబ్‌కు

రూ.20 వేల జరిమానా

– తాగునీటి దుర్వినియోగంపై జలమండలి కఠిన చర్యలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టే దిశగా జలమండలి కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రముఖ పబ్‌పై భారీ జరిమానా విధించడంతో పాటు, నీటి కనెక్షన్‌ను తొలగించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. నీటి వృథా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఈ చర్యల ద్వారా స్పష్టం చేసింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో ఉన్న 'ఫోర్ ఫాదర్స్ పబ్' తాగునీటిని విపరీతంగా దుర్వినియోగం చేస్తున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన విజిలెన్స్ అధికారులు, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. పబ్‌లో నీటిని వృథా చేస్తున్నట్లు తనిఖీల్లో నిర్ధారణ కావడంతో, యాజమాన్యానికి రూ.20 వేల జరిమానా విధించారు. అంతటితో ఆగకుండా, ఆ పబ్ తాగునీటి కనెక్షన్‌ను

2లో..

పురపోరులో ముగిసిన నామినేషన్ల స్వీకరణ

– కొన్ని చోట్ల నామినేషన్లు వేయలేకపోయిన వైసీపీ అభ్యర్థులు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది.రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆదివారం మధ్యాహ్నం వరకు ఎస్ఈసీ గడువు విధించింది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల గడువు ముగిసింది అని ఎస్ఈసీ వెల్లడించింది. నామినేషన్లకు చివరి రోజు కావడంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి.

ముగిసిన నామినేషన్ల పర్వం

రాష్ట్రంలో పురపోరుకు సంబంధించి కీలకమైన నామినేషన్ల పర్వం ముగిసింది. నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి రోజు కావడంతో ఆయా పార్టీల అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. దీంతో రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలన్నీ కిటకిటలాడాయి.నామినేషన్ల గడువు మధ్యాహ్నం 3 గంటల వరకు ఉండటంత మూడు

2లో..

నామినేషన్లు వేయలేకపోతే

ఎస్ఈసీ పరువు పోతుంది

– నామినేషన్ దాఖలు గడువు పెంచాలని ఎస్ఈసీని కోరిన జగన్

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా చోటు చేసుకుంటున్న దౌర్జన్యాలు, టీడీపీ శ్రేణుల హింసాకాండ, వైసీపీ అభ్యర్థులపై అక్రమ కేసులు, అరెస్టులు, నామినేషన్ పత్రాలను చించివేస్తున్న ఘటనలు, అలాగే పుంగనూరులో వైయస్సార్‌సీపీ లోక్‌సభ పక్ష నేత పీవీ మిథున్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం, పులివెందులలో పోలీసుల బాష్పవాయు ప్రయోగం, గాలిలోకి కాల్పుల ఘటనలపై మాజీసీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠకు ఫిర్యాదు చేశారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కార్యాలయంలో ఆయన్ను కలిసిన వైఎస్ జగన్ ఆ తర్వాత ఆ ఆఫీస్ వద్దే మీడియాతో మాట్లాడారు.'నామినేషన్లు వేయలేకపోతే ఎస్ఈసీ పరువు పోతుంది. నామినేషన్ల దాఖలు గడువు వెంటనే పెంచాలి. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ ఎస్కార్ట్ ఇవ్వాలి'అని అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలను ఫణంగా పెట్టొద్దు

'ఒక స్టేట్ ఎలక్షన్ కమిషనర్‌గా నిష్పక్షపాతంగా ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన రాజ్యాంగబద్ధమైన బాధ్యత మీపై ఉంది'అని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠను కోరినట్లు వైసీపీ అధినేత వైఎస్ జగన్ తెలిపారు.ఈ వ్యవస్థను ఏ ఒక్కరి స్వార్థం కోసం కూడా ఫణంగా పెట్టకూడదన్న అంశాన్ని కమిషనర్‌కు స్పష్టంగా నొక్కి చెప్పడం జరిగింది. మాకు అందిన సమాచారం మేరకు దాడులకు సంబంధించిన తాజా పరిస్థితులతో కూడిన జాబితాను కూడా ఆయనకు అందజేశాం.

ఒక్కరు నామినేషన్ వేయలేకపోయినా ఎస్ఈసీ పరువే పోతుంది

ఈ రాష్ట్రంలో ఏ ఒక్కరైనా, ఏ ఒక్క ప్రాంతంలోనైనా 'నేను నామినేషన్ వేయాలనుకున్నాను.. కానీ నన్ను వేయనివ్వలేదు' అన్న మాట వస్తే, పోయేది రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పరువే అని గట్టిగా చెప్పాం. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్పీలే స్వయంగా ముందుండి ఎస్కార్ట్ ఇచ్చి వైయస్సార్‌సీపీ అభ్యర్థులందరితో నామినేషన్లు వేయించాల్సిన రాజ్యాంగ

2లో..

నటుడు టైగర్ ష్రాఫ్‌పై

కాల్పులు

– బాధ్యత తమదేనన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్

ముంబై (ప్రశ్న న్యూస్) బాలీవుడ్‌లో మరోసారి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కలకలం సృష్టించింది. ప్రముఖ నటుడు టైగర్ ష్రాఫ్‌పై ఆదివారం సాయంత్రం జరిగిన దాడికి తామే బాధ్యత వహిస్తున్నామని సంచలన ప్రకటన చేసింది. అంతేకాకుండా, బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసే వారిని వదిలిపెట్టబోమని తీవ్రస్థాయిలో హెచ్చరించింది. ఈ ఘటన ముంబై సినీ వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ మేరకు గ్యాంగ్ ప్రతినిధి అనిల్ పండిట్ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో బాధ్యతను ప్రకటించాడు. "జై మహాకాళ్.. జై శ్రీరామ్.. సోదరులందరికీ నమస్కారం. టైగర్ ష్రాఫ్ ఘటనకు మేం బాధ్యత వహిస్తున్నాం. అతనికి మేం ఫోన్ చేసి ముందే హెచ్చరించాం, కానీ అతను అర్థం చేసుకోలేదు. అందుకే ఈ రోజు మరింత గట్టిగా అర్థమయ్యేలా చేశాం. ముంబై ఫిల్మ్ ఇండస్ట్రీలో మా మాట వినని వారు, సల్మాన్ ఖాన్‌తో పనిచేసే వారు తర్వాతి లక్ష్యం అవుతారు. వేచి చూడండి" అని ఆ పోస్ట్‌లో హెచ్చరించారు. తమ పేరు వాడుకుని ప్రచారం పొందాలనుకునే ఇతర గ్రూపులను కూడా చంపేస్తామని వారు అందులో పేర్కొన్నారు.మరోవైపు,

2లో..

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల

జీతాల కోత అన్యాయం

– జీతాలు పెంచకపోతే ప్రజా ఉద్యమమేనన్న కవిత

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల వేతనాలను తగ్గిస్తూ ప్రభుత్వం జీవో 1195 తీసుకురావడం అన్యాయమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కేంద్రం నుంచి నిధులు వస్తున్నప్పటికీ ఉద్యోగుల జీతాల్లో కోతలు విధించడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా.. వారిలో కొందరి వేతనాలను నెలకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు తగ్గించారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఉద్యోగుల

2లో..

తెలంగాణలో ఘనంగా

సద్దుల బతుకమ్మ సంబురాలు

– ట్యాంక్‌బండ్‌పై వేడుకల్లో విజయ్ దేవరకొండ, రష్మిక

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగ రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ తీరం ట్యాంక్‌బండ్ వద్ద ఈ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలన్నీ పండుగ శోభతో విలసిల్లాయి. వేడుకల్లో భాగంగా ట్యాంక్‌బండ్ అమరవీరుల స్మారక చిహ్నం నుంచి భారీ మహా బతుకమ్మ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో సుమారు 700 మంది జానపద కళాకారులు తమ అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకోగా, 600 మందికి పైగా మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలతో ఊరేగింపుగా తరలివచ్చారు. ట్యాంక్‌బండ్ వేదికగా నిర్వహించిన బతుకమ్మ ఆటలు, కోలాటాలు,

2లో..

నామినేషన్లు వేయలేకపోతే

ఎస్ఈసీ పరువు పోతుంది

ధర్మం ఉంది. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ.. సమయం పొడిగించి అయినా సరే రాష్ట్రంలో పోటీ చేయాలనుకున్న ప్రతి ఒక్కరితో నామినేషన్ వేయిస్తామని హామీ ఇచ్చారు.

గురజాలలో అభ్యర్థులనే అక్రమంగా అరెస్ట్ చేసిన పోలీసులు

గురజాల నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీల్లో స్వయంగా పోలీసులే మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థులపై దొంగ కేసులు బనాయించి అక్రమంగా అరెస్ట్ చేసి పోటీకి దూరం చేస్తున్నారు. అక్రమంగా నిర్బంధించిన ఆ అభ్యర్థులను పోలీసులు వెంటనే తీసుకొచ్చి వారితో నామినేషన్లు వేయించాలని గట్టిగా డిమాండ్ చేశాం.

టీడీపీకి కొమ్ము కాస్తున్న పోలీసులు

రాష్ట్రంలో నామినేషన్ల ప్రక్రియ ఇంత దారుణంగా సాగుతుంటే, పోలీసులు మాత్రం నిస్సిగ్గుగా వెన్నుపోటు పార్టీకి, చంద్రబాబునాయుడుగారికి కొమ్ము కాస్తున్నారు. నిబంధనల ప్రకారం నలుగురు మాత్రమే వెళ్లాలని మా వైయస్సార్‌సీపీ వాళ్లను ఆపుతున్నారు.. తీరా నామినేషన్ కేంద్రాల వద్ద చూస్తే అప్పటికే టీడీపీ వాళ్లు వందల సంఖ్యలో గుమిగూడి మారణాయుధాలతో తిష్టవేస్తున్నారు. పోలీసుల సమక్షంలోనే మా అభ్యర్థుల చేతుల్లోని నామినేషన్ పత్రాలను లాక్కొని చింపేస్తున్నారు. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తూ టీడీపీకి వత్తాసు పలుకుతున్నందున ఎన్నికల విధులకు వెంటనే కేంద్ర ప్రభుత్వ బలగాలను, పారా మిలటరీ ఫోర్సెస్‌ను దించాలని డిమాండ్ చేశాం.

అన్ని చోట్లా సీసీ కెమెరా ఫుటేజ్ కావాలి

'పోలింగ్ బూతుల లోపల, బయట సీసీటీవీ లైవ్ ఫుటేజ్ సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా లైవ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలి. మాకు చంద్రబాబునాయుడు, వెన్నుపోటు పార్టీ నైజంపై ఏ మాత్రం నమ్మకం లేదు. వాళ్లు స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్సులను మారుస్తారన్న గట్టి నమ్మకం, అనుమానం మాకుంది. అందుకే స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్సులు ఉంచే ప్రదేశాల్లో కూడా సీసీటీవీ కెమెరాల లైవ్ ఫుటేజ్‌ను ప్రజలందరికీ పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి. కౌంటింగ్ హాల్‌లో కూడా సీసీ కెమెరాలు పెట్టి లైవ్ టెలికాస్ట్ ఇవ్వాలి'అని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.'కౌంటింగ్ హాల్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత ఏజెంట్లు సంతకాలు చేసి స్టిక్కర్లు అతికించే 'ఫామ్ 17సి' వెరిఫికేషన్ ప్రక్రియ అత్యంత కీలకం. ఆ సంతకాలు సరిపోల్చే ప్రక్రియలో ఎలాంటి ఫోర్జరీలకు తావు లేకుండా సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డ్ చేసి చూపించాలి. ఈ డిమాండ్లపై గతంలోనే మా ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చారు. ఇవాళ నేను కూడా స్వయంగా వచ్చి వీటిని అమలు చేయాలని గట్టిగా చెప్పాను'అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ పేర్కొన్నారు.

ఎస్ఈసీ చిత్తశుద్ధికి ఇదే పరీక్ష

'మేము అడిగిన వాటన్నింటికీ కమిషనర్ తల ఊపారు. ఎస్ఈసీ నిజంగా ట్రాన్స్‌పరెంట్‌గా ఉంటే ఇవన్నీ అమలవుతాయి. కమిషన్ పారదర్శకంగా లేకపోతే ఇవేవీ జరగవు. దీన్నిబట్టే వీళ్లు నిష్పక్షపాతంగా ఉన్నారా లేదా అనేది ప్రజలకు స్పష్టంగా అర్థమైపోతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలకు నచ్చిన వారికి ఓటు వేసే స్వేచ్ఛ, నాయకులకు పోటీ చేసేందుకు నామినేషన్ వేసే హక్కు రాజ్యాంగబద్ధమైనవి. ఈ ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన ధర్మం ఎస్ఈసీపైనే ఉంది'అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు.

చంద్రబాబు ప్రైవేట్ వాచ్‌మెన్లుగా మారిన పోలీసులు

'రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీసు యంత్రాంగం చంద్రబాబునాయుడుగారికి ప్రైవేట్ వాచ్‌మెన్లుగా తయారైంది. ఒక ఐజీ, ఆయన కింద డీఎస్పీలు, సీఐలు ఒక సిండికేట్ మాఫియాగా ఏర్పడ్డారు. సాధారణంగా ఏ అధికారైనా ఒకే చోట రెండేళ్లకు మించి ఉండకూడదన్న నిబంధన ఉన్నా, రెండున్నరేళ్లుగా వాళ్లనే పాత స్థానాల్లో కొనసాగిస్తున్నారు. టీడీపీకి అనుకూలంగా ఎన్నికలను నడిపించేందుకే ఈ వ్యవస్థీకృత మాఫియాను కంటిన్యూ చేస్తున్నారు. ఈ పోలీసు మాఫియా స్థానిక ఎమ్మెల్యేలతో కుమ్మక్కై ఇసుక రీచ్‌ల నుంచి లిక్కర్ వ్యాపారం దాకా అందినకాడికి దోచుకుంటూ 'చిన్నబాబుకు ఇంత, పెద్దబాబుకు ఇంత' అని వాటాలు పంచుకుంటూ రాష్ట్రాన్ని లూటీ చేస్తోంది. ఇలాంటి వారి చేతుల్లోనే ఇవాళ ఎన్నికలు నిర్వహిస్తున్నారు'అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు.

నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు

ముంబై క్రైమ్ బ్రాంచ్ షేర్ చేసిన ఒక ఆడియోలో అనిల్ పండిట్ నేరుగా సల్మాన్ ఖాన్‌ను బెదిరించాడు. "సల్మాన్ ఖాన్, నేను చెప్పేది జాగ్రత్తగా విను. మా అన్న లారెన్స్ బిష్ణోయ్‌కు, బిష్ణోయ్ సమాజానికి క్షమాపణ చెప్పకపోతే, నీ ఇంట్లో కుక్కను కూడా వదిలిపెట్టం. నీ కుటుంబాన్ని మొత్తం నాశనం చేస్తాం. ఇది గుర్తుపెట్టుకో. నీకు సెక్యూరిటీ ఉందని, నీకేమీ కాదని అనుకోవద్దు" అని ఆ ఆడియోలో తీవ్రంగా హెచ్చరించాడు.

ఆదివారం సాయంత్రం ముంబైలోని జుహు ప్రాంతంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ సురక్షితంగా బయటపడగా, అతని డ్రైవర్‌కు గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించి, వెంటనే దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు.కాగా, 2024 ఏప్రిల్ 14న కూడా బాంద్రాలోని సల్మాన్ ఖాన్ గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ వెలుపల ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. తాజా ఘటనతో బిష్ణోయ్ గ్యాంగ్ మరోసారి బాలీవుడ్‌ను టార్గెట్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

తెలంగాణలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

జానపద గేయాలు విశేషంగా అలరించాయి. ఈ సద్దుల బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క హాజరయ్యారు. వీరితో పాటు టాలీవుడ్ ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారిని మంత్రి జూపల్లి శాలువతో సత్కరించారు.

నూతన దంపతులుగా ఈ వేడుకల్లో పాల్గొన్న విజయ్-రష్మిక జంట మహిళలతో కలిసి బతుకమ్మ సంబురాల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వారి రాక ట్యాంక్‌బండ్ వద్ద కోలాహలంగా మారింది. హుస్సేన్ సాగర్ తీరాన బతుకమ్మ వేడుకల్లో నిర్వహించిన లేజర్ షో, రంగురంగుల బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

టామ్ కామ్ వ్యవహారంపై

సీఐడీ విచారణ జరిపించాలి

చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టోమ్‌కామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టామ్కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా, గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్ రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.

ఈ మోసానికి పాల్పడిన టామ్కామ్, ఫెయిర్‌స్ట్రీట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారు కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వడ్డీ భారం, మానసిక వేదనకు నష్టపరిహారం అందించాలన్నారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై తక్షణమే సీఐడీ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫీజుల వసూళ్లు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు తన పోస్టులో స్పష్టం చేశారు.

ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు!

మారుతోంది.

పండుగ సరుకుల కొనుగోళ్లతో అదనపు భారం

పండుగ అంటే పూజా సామగ్రి, పండ్లు, పూలు, కొబ్బరికాయలు, నైవేద్య పదార్థాలు, స్వీట్లు తప్పనిసరి. వీటితోపాటు కొత్త దుస్తులు, పిల్లలకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. బంధువుల రాకపోకలు, ప్రయాణ ఖర్చులు కూడా తోడవుతాయి. ఒక్కో ఖర్చు చిన్నదిగా కనిపించినా అన్నీ కలిపితే కుటుంబ బడ్జెట్‌పై పెద్ద ప్రభావమే పడుతోంది.పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలనే ఆకాంక్ష ఒకవైపు అందుకు అవసరమైన డబ్బును సమకూర్చుకోవాలనే ఆందోళన మరోవైపు సామాన్య కుటుంబాలను వెంటాడుతున్నాయి. కొందరు కొత్త దుస్తుల కొనుగోళ్లను వాయిదా వేస్తుండగా, మరికొందరు అవసరమైన సరుకుల పరిమాణాన్ని తగ్గించుకుంటున్నారు. ఇంకొందరు అప్పులు చేసి పండుగ జరుపుకోవాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. పండుగ ఆనందం కోసం చేసే ఖర్చు, ఆ తర్వాతి నెల కుటుంబ నిర్వహణకు ఇబ్బందిగా మారుతోంది.

ఆదాయం పెరగదు.. ఖర్చులు మాత్రం ఆగవు!

ధరలు పెరిగిన ప్రతిసారీ దానికి అనుగుణంగా వేతనాలు, ఆదాయాలు పెరగడం లేదు. నెలవారీ జీతంతో ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ప్రయాణ వ్యయాలు, రుణ వాయిదాలు చెల్లించిన తర్వాత చేతిలో మిగిలేది పరిమిత మొత్తమే. అలాంటి పరిస్థితుల్లో పండుగ ఖర్చుల కోసం ప్రత్యేకంగా డబ్బు కేటాయించడం కష్టమవుతోంది.

మధ్యతరగతి కుటుంబాలు తమ అవసరాలను తగ్గించుకుంటూ జీవనం సాగిస్తుంటే, పేద కుటుంబాలు కనీస అవసరాలకే ప్రాధాన్యమివ్వాల్సి వస్తోంది. పండుగ సమయంలో పిల్లల కోరికలు తీర్చలేకపోవడం, కుటుంబ సభ్యుల అవసరాలను వాయిదా వేయడం వారికి మానసిక వేదనగా మారుతోంది. పండుగల ఆనందం ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలంటే ధరల భారం తగ్గాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ధరల నియంత్రణపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు సరఫరా సమస్యలు, రవాణా వ్యయాలు, సీజనల్ మార్పులు, మధ్యవర్తుల ప్రభావం వంటి అనేక కారణాలు ఉండవచ్చు. అయితే ఏ కారణంతో ధరలు పెరిగినా దాని భారాన్ని చివరికి మోసేది వినియోగదారుడే. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో ధరల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షించాలి.

కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలు ఉన్నాయా అన్నది తనిఖీ చేయాలి. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూడటంతోపాటు వినియోగదారులకు సరసమైన ధరలకు సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలి. రైతుబజార్లు, సహకార విక్రయ కేంద్రాలు, తక్కువ ధరల దుకాణాల ద్వారా అవసరమైన వస్తువులను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాలి. ధరల వివరాలను పారదర్శకంగా ప్రకటించడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం కూడా అవసరం.

పండుగ వెలుగులు ప్రతి ఇంటా విరియాలి!

పండుగ అనేది ధనికులకే పరిమితమైన వేడుక కాదు. ప్రతి కుటుంబానికి ఆనందాన్ని పంచే సామాజిక, సాంస్కృతిక సందర్భం. ధరల భారం కారణంగా సామాన్యులు పండుగ చేసుకోవాలా ఇంటి అవసరాలను తీర్చుకోవాలా అని ఆలోచించాల్సి రావడం ఆందోళనకరం. పండుగల అసలు స్ఫూర్తి ఆడంబరాల్లో కాదు, ఆత్మీయతలో ఉంది. అయినప్పటికీ కనీస అవసరాల కొనుగోలు కూడా భారంగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. నిత్యావసర ధరలకు కళ్లెం వేసి, మార్కెట్‌ను నియంత్రణలో ఉంచి, సామాన్యుడి కొనుగోలు శక్తిని కాపాడినప్పుడే పండుగల వెలుగులు ప్రతి ఇంటా నిజమైన ఆనందాన్ని నింపగలవు.

ఓటు చోరీకి మోదీ ప్లాన్

అదానీ, అంబానీలకు ప్రయోజనాలు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొందరు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని రాహుల్ ఆరోపించారు. గౌతమ్ అదానీ, ముఖేశ్ అంబానీలకు మేలు చేకూర్చేలా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, భూములు, ఇతర ఆర్థిక అవకాశాలను కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రతిఫలంగా ఆయా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి ప్రచారం కల్పిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కొందరు బిలియనీర్లకు డబ్బు, కాంట్రాక్టులు, భూములు అందిస్తూ, వారి ద్వారా రాజకీయ ప్రచార ప్రయోజనాలు పొందుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రభుత్వ వ్యవస్థ పనిచేస్తున్న తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు.

గోవాలో భూములు లాక్కుంటున్నారు

గోవాలో రైతులు, పేదలకు చెందిన భూములను ప్రభుత్వం లాక్కొని బయటి వ్యక్తులకు అప్పగిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రాంతీయ మాస్టర్ ప్లాన్ రద్దు నేపథ్యంలో ప్రభుత్వానికి సన్నిహితులైన వారికి భూములు కట్టబెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. రాష్ట్ర సహజ సంపద, సాంస్కృతిక వారసత్వాన్ని ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు.

దేశంలో అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రంగా గోవా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఉద్యోగ కల్పన వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. గతంలో నరేంద్ర మోదీ హయాంలో గుజరాత్ నమూనా గురించి మాట్లాడేవారని, ఇప్పుడు గోవాలో అవినీతి నమూనా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

యువతను వెలివేసే వ్యవస్థ

దేశంలోని విద్యా వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. డబ్బు అధికారం లేనివారిని, ఆంగ్లంలో మాట్లాడలేని వారిని ప్రస్తుత వ్యవస్థ పక్కన పెడుతోందని విద్యార్థులతో తన సంభాషణకు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. లక్షలాది మంది భారతీయ యువతకు విద్యా అవకాశాలు దక్కకుండా చేసే విధానాన్ని విద్యా వ్యవస్థగా పిలవలేమని వ్యాఖ్యానించారు.

పురపోరులో ముగిసిన నామినేషన్ల స్వీకరణ

గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు.

ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.

దర్శిలో నామినేషన్లు వేయలేకపోయిన వైసీపీ సభ్యులు

మరోవైపు సమయానికి రిటర్నింగ్ అధికారుల కార్యాలయానికి చేరుకోలేని పలువురు వైసీపీ నాయకులకు ఎదురుదెబ్బ తగిలింది. మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు చేరుకోకపోవడంతో పలువురు వెనుదిరగాల్సి వచ్చింది.

ముఖ్యంగాప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

తదుపరి షెడ్యూల్ ఇదే

నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 19 నామినేషన్ల పరిశీలన జరుగుతుంది.

అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు.

ఫోర్ ఫాదర్స్' పబ్‌కు రూ.20 వేల జరిమానా

శాశ్వతంగా తొలగించారు. అంతేకాక, జలమండలి ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి కమర్షియల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను కూడా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

వేసవి దృష్ట్యా కఠిన చర్యలు.. ప్రజలకు విజ్ఞప్తి

వచ్చే ఏడాది వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకే ఈ కఠిన చర్యలు చేపట్టినట్లు జలమండలి స్పష్టం చేసింది. ప్రతి నీటి చుక్కనూ పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు వంటి వాణిజ్య సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నీటి వృథాకు పాల్పడితే ఇలాంటి చర్యలే కొనసాగుతాయని హెచ్చరించింది. నీటి సంరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని జలమండలి కోరింది. ఎక్కడైనా తాగునీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే, ఫొటోలు లేదా వీడియోలతో సహా పూర్తి వివరాలను వాట్సాప్ నంబర్ 99499 30003కు పంపాలని సూచించింది. లేదా కస్టమర్ కేర్ నంబర్ 155313కు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల

జీతాల కోత అన్యాయం

జీతాలు తగ్గించడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఆదివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల జేఏసీ నాయకులతో కలిసి కవిత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కొందరు ఉద్యోగుల వేతనాలను పెంచి, మరికొందరి జీతాలను తగ్గించడం వివక్షకు నిదర్శనమని విమర్శించారు. ఉద్యోగుల వేతనాల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వారికి సమయానికి జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల శ్రమను దోచుకునే విధంగా వ్యవహరిస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల వేతనాల అంశంపై సమగ్ర సమీక్ష నిర్వహించి, వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కవిత కోరారు. వేతనాల తగ్గింపునకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించి, ఉద్యోగుల జీతాలను పెంచేలా వైద్యారోగ్య శాఖ మంత్రికి ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ఉద్యోగులకు ఏటా ఐదు శాతం వేతన పెంపు ఉండాలనే నిబంధనలు ఉన్నాయని పేర్కొంటూ, అలాంటప్పుడు జీతాలను తగ్గించడం వెనుక కారణాలేమిటని ప్రశ్నించారు.ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు వారి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్‌ప్రదేశ్‌లోనూ ఈ ప్రక్రియ చేపట్టారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల వేతనాలను 30 శాతం పెంచడంతోపాటు, వారిని క్రమబద్ధీకరించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేశారని పేర్కొన్నారు. తెలంగాణలో ఉద్యోగులకు అందాల్సిన నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారంటూ విమర్శలు చేశారు. రాష్ట్రంలోని ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరి వేతనాలను పెంచి, వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని కవిత అన్నారు. టీకాల కార్యక్రమాలతోపాటు స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో వారి సేవలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఉద్యోగులు ఒక్కరోజు విధులకు దూరమైనా గ్రామీణ ఆరోగ్య వ్యవస్థపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. వేతనాల కోతకు నిరసనగా ధర్నా చేసేందుకు అనుమతి కోరినా ఇవ్వడం లేదని, వైద్యారోగ్య శాఖ మంత్రి ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే వారి తరఫున పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని కవిత హెచ్చరించారు.

నిరుద్యోగ యువతకు శుభవార్త..

90 రోజుల ఉచిత డేటా ఇంజినీరింగ్ కోర్సు

హనుమకొండ, అక్టోబర్ 18:తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు పెంపొందించేందుకు శ్రీ సత్యసాయి దక్షత కార్యక్రమం పూర్తిగా ఉచిత డేటా ఇంజినీరింగ్ కోర్సును అందుబాటులోకి తీసుకొస్తోంది. డేటా ఇంజినీరింగ్ రంగంలో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పట్టభద్రులకు అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. 2022 నుంచి 2026 మధ్య ఎమ్మెస్సీ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసిన పట్టభద్రులు ఈ శిక్షణకు అర్హులు. తరగతులు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించనున్నారు. మూడు దశాబ్దాల బోధనా అనుభవం ఉన్న అధ్యాపకులు అభ్యర్థులకు శిక్షణ అందించనున్నారు.మొత్తం 90 రోజుల పాటు జరిగే ఈ కోర్సులో బేసిక్, అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్‌క్యూఎల్, ఏఐ టూల్స్, డేటా ఇంజినీరింగ్ అంశాలతో పాటు సాఫ్ట్ స్కిల్స్, కెరీర్ కౌన్సెలింగ్‌లో శిక్షణ ఇస్తారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ నియామక సహాయం కూడా అందించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. గత బ్యాచ్‌లో 350 మందికిపైగా పట్టభద్రులు శిక్షణ పొందగా, వారిలో 100 మందికిపైగా ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. సాంకేతిక రంగంలో నైపుణ్యాల కొరతను తగ్గించడంతో పాటు తెలంగాణ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.

రిజిస్ట్రేషన్ వివరాలుఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు www.dakshata.ai వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం 9052372023 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కోర్సుకు ఎలాంటి ఫీజు ఉండదని స్పష్టం చేశారు.

థార్ కారు బీభత్సం..

బైక్‌ను ఢీకొని ఇద్దరు దుర్మరణం

హైదరాబాద్ హయత్‌నగర్‌లోని విజయవాడ జాతీయ రహదారిపై థార్ కారు బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చిన థార్ కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. నాలుగేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది.వివరాల్లోకి వెళ్తే.. ఎల్‌బీ నగర్‌లో నివాసం ఉంటున్న రేఖ తన నాలుగేళ్ల కుమార్తెను తీసుకుని తన సోదరుడు నవీన్‌తో కలిసి పెద్ద అంబర్‌పేటలోని పుట్టింటికి బయల్దేరింది. బైక్‌పై బయల్దేరిన వారు హయత్‌నగర్‌కు చేరుకోగానే.. వేగంగా వచ్చిన థార్ కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రేఖ, నవీన్ అక్కడికక్కడే మృతిచెందారు. నాలుగేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. ఇది గమనించిన స్థానికులు 108 సాయంతో చిన్నారిని ఆస్పత్రికి తరలించారు.బతుకమ్మ, దసరా పండుగల కోసం పుట్టింటికి వెళ్తుండగా ప్రాణాలు కోల్పోవడంతో బాధిత కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారు.. ఓ పోలీసు అధికారికి చెందినదిగా గుర్తించారు.

తాగునీరు వృథా చేస

శేరిలింగంపల్లిలో ఘనంగా
దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) శేరిలింగంపల్లి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని పలువురు పాత్రికేయులు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు అనిల్ కుమార్ ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, నాగరత్నం ముదిరాజ్, డబ్బా శ్రీనివాస్ ముదిరాజ్, మహమ్మద్ కాజా పాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మాత దుర్గాదేవి కృపాకటాక్షాలు శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కాలనీవాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమష్టిగా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు వికాస్ గౌడ్, సాయి గౌడ్‌తో పాటు స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాష్టమి వేళ నిరుపేద పిల్లలకు
నూతన దుస్తుల పంపిణీ

శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్) పర్వదినాన్ని పురస్కరించుకుని రహమత్‌నగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద దర్శ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద పిల్లలకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు శివ మాలతీ భూపతి మాట్లాడుతూ పండుగ వేళ నిరుపేద పిల్లల ముఖాల్లో ఆనందం చూడటమే తమ లక్ష్యమని తెలిపారు. సమాజంలోని పేదలకు అండగా నిలుస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. దుస్తులు అందుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ట్రస్టీలు శివ సాయి కుమార్ భూపతి, సాయికుమార్ గణేష్, కృష్ణ కుమార్ శర్మ, ఆకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం శిల్ప నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మాజీ కౌన్సిలర్ అనంతరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు

ముఖ్య అతిథులుగా హరీశ్ రావు, మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి

గాయని మధుప్రియ పాటలతో సందడి..

పూల పండుగలో మహిళల ఉత్సాహం

కీసర(ప్రశ్న న్యూస్)మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని శిల్ప నగర్ కాలనీలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ అనంతరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వైభవంగా ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సైతం వేడుకలకు హాజరయ్యారు. ప్రముఖ గాయని మధుప్రియ బతుకమ్మ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలతో వేడుకలకు కళ తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధుల రాకతో శిల్ప నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలు ఉత్సాహభరితంగా ముగిశాయి.

నవరాత్రుల తొమ్మిదో రోజు..
సిద్ధిదాత్రి అమ్మవారి అవతారం విశిష్టత

సకల సిద్ధులను ప్రసాదించే జగన్మాత.. జ్ఞానం, శక్తి, సంపూర్ణతకు ప్రతీకగా ఆదిశక్తి

నవదుర్గలలో చివరి అవతారం.. భక్తుల కోరికలు నెరవేరాలని ఆరాధించే దివ్యస్వరూపిణి

(ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న)

నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదో రోజుకు ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. నవదుర్గలలో తొమ్మిదో, చివరి రూపమైన సిద్ధిదాత్రి అమ్మవారిని ఈ రోజున భక్తులు భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. సకల సిద్ధులను, జ్ఞానాన్ని, ఆధ్యాత్మిక శక్తిని ప్రసాదించే తల్లిగా సిద్ధిదాత్రి దేవిని కొలుస్తారు. నవరాత్రుల ఆరాధనలో చివరి రూపమైన ఈ అమ్మవారు సంపూర్ణతకు, దైవానుగ్రహానికి, ఆత్మజ్ఞానానికి ప్రతీకగా నిలుస్తారు.

సిద్ధిదాత్రి అనే పేరు వెనుక అర్థం ఏమిటి?

'సిద్ధి' అంటే సాధన ద్వారా పొందే శక్తి, విజయం లేదా ఆధ్యాత్మిక పరిపూర్ణత. 'దాత్రి' అంటే ప్రసాదించేది. అందువల్ల సిద్ధులను ప్రసాదించే దేవిని సిద్ధిదాత్రి అని పిలుస్తారు.
హిందూ పురాణ సంప్రదాయాల ప్రకారం, సిద్ధిదాత్రి అమ్మవారు భక్తులకు అష్టసిద్ధులను ప్రసాదించే దైవశక్తిగా వర్ణించబడతారు. ఈ సిద్ధులు ఆధ్యాత్మిక శక్తులకు ప్రతీకలుగా భావిస్తారు. అయితే ఈ అవతారం కేవలం అద్భుత శక్తులకే పరిమితం కాదు.. జ్ఞానం, వివేకం, మనోనిగ్రహం, ఆత్మవిశ్వాసం వంటి ఉన్నత లక్షణాలను కూడా సూచిస్తుంది.

అమ్మవారి దివ్యరూపం.. విశిష్టత

సిద్ధిదాత్రి అమ్మవారు సాధారణంగా కమలంపై ఆసీనురాలై దర్శనమిస్తారు. నాలుగు చేతులతో కనిపించే ఈమె చేతుల్లో శంఖం, చక్రం, గద, కమలం ఉంటాయని సంప్రదాయ చిత్రణలు వివరిస్తాయి. కొన్ని చిత్రణల్లో చేతుల్లోని వస్తువుల అమరికలో స్వల్ప మార్పులు కనిపిస్తాయి.
- శంఖం: పవిత్రతకు, శుభారంభానికి ప్రతీక.
- చక్రం: ధర్మరక్షణకు, దుష్టశక్తుల నిర్మూలనకు సంకేతం.
- గద: శక్తికి, ధైర్యానికి ప్రతీక.
- కమలం: స్వచ్ఛతకు, ఆధ్యాత్మిక వికాసానికి నిదర్శనం.

అమ్మవారి ప్రశాంతమైన రూపం జ్ఞానాన్ని, కరుణను, ఆధ్యాత్మిక పరిపూర్ణతను సూచిస్తుంది. ఆమెను ఆరాధించడం ద్వారా భక్తులు తమ జీవితాల్లో సద్బుద్ధి, శాంతి, సత్ప్రవర్తన పెంపొందాలని కోరుకుంటారు.

పురాణ గాథలో సిద్ధిదాత్రి అమ్మవారి ప్రాధాన్యత

పురాణ కథనాల ప్రకారం, సిద్ధిదాత్రి అమ్మవారు దేవతలకు, ఋషులకు, భక్తులకు వివిధ సిద్ధులను ప్రసాదించే మహాశక్తిగా వర్ణించబడతారు. సృష్టి ఆరంభంలో పరమశక్తి తన దివ్యరూపంతో సృష్టికి ఆధారంగా నిలిచిందని, శివుడికి కూడా వివిధ సిద్ధులను అనుగ్రహించిందని కొన్ని పురాణ సంప్రదాయాలు చెబుతాయి.
మరో సంప్రదాయం ప్రకారం, ఆదిశక్తి అనుగ్రహంతో శివుడి అర్ధభాగం స్త్రీరూపంగా మారి అర్ధనారీశ్వర స్వరూపం ఏర్పడిందని చెబుతారు. ఇది స్త్రీ, పురుష శక్తుల సమన్వయానికి, సృష్టిలో సమతుల్యతకు ప్రతీకగా భావిస్తారు. ఈ కథనాలు సిద్ధిదాత్రి అమ్మవారి మహిమను మాత్రమే కాకుండా, సృష్టిలో శక్తి ప్రాధాన్యతను, సమన్వయాన్ని, సంపూర్ణతను తెలియజేస్తాయి.

తొమ్మిదో రోజు పూజల విశిష్టత

నవరాత్రుల తొమ్మిదో రోజున మహానవమి సందర్భంగా భక్తులు సిద్ధిదాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పుష్పార్చన, దీపారాధన, నైవేద్య సమర్పణ, అమ్మవారి నామస్మరణ, మంత్రపఠనం వంటి ఆచారాలతో పూజిస్తారు. కొన్ని ప్రాంతాల్లో కన్యాపూజకు కూడా విశేష ప్రాధాన్యత ఉంటుంది.
సిద్ధిదాత్రి అమ్మవారిని ఆరాధించడం వల్ల జ్ఞానం, వివేకం, విజయం, మనశ్శాంతి కలుగుతాయని భక్తుల విశ్వాసం. విద్యార్థులు విద్యలో రాణించాలని, ఉద్యోగులు తమ పనుల్లో అభివృద్ధి సాధించాలని, కుటుంబాల్లో సుఖసంతోషాలు నెలకొనాలని భక్తులు ప్రార్థిస్తారు.

నేటి సమాజానికి అమ్మవారి సందేశం

సిద్ధిదాత్రి అమ్మవారి అవతారం నేటి సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. జీవితంలో విజయం సాధించాలంటే కేవలం అదృష్టాన్ని నమ్ముకోవడం సరిపోదు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన, జ్ఞానం, మంచి ఆలోచనలు అవసరం.మనకు లభించిన ప్రతిభను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలి. ఇతరులకు సహాయం చేయాలి. అహంకారానికి దూరంగా ఉంటూ, వినయంతో ముందుకు సాగాలి. నిజమైన సిద్ధి అంటే కేవలం లక్ష్యాన్ని చేరుకోవడం మాత్రమే కాదు.. మనలోని చెడు లక్షణాలను అధిగమించి, మంచి మనిషిగా ఎదగడం కూడా అని ఈ అవతారం గుర్తుచేస్తుంది.

నవదుర్గల ఆరాధనకు సంపూర్ణత

నవరాత్రుల్లో మొదటి రోజు శైలపుత్రి అమ్మవారితో ప్రారంభమైన ఆరాధన, తొమ్మిదో రోజు సిద్ధిదాత్రి అమ్మవారి పూజతో సంపూర్ణతను పొందుతుంది. ఈ తొమ్మిది రూపాలు స్త్రీశక్తిలోని వివిధ కోణాలను తెలియజేస్తాయి. ధైర్యం, తపస్సు, కరుణ, సృష్టిశక్తి, మాతృత్వం, ధర్మరక్షణ, భయనివారణ, పవిత్రత, ఆధ్యాత్మిక సంపూర్ణత వంటి విలువలను భక్తులకు గుర్తుచేస్తాయి.

కుషాయిగూడలో ధీరవ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవం

కాప్రా (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గం కుషాయిగూడలో ఏర్పాటు చేసిన ధీరవ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి కార్యక్రమానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,ఉప్పల్ నియోజకవర్గ

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి ,డాక్టర్ రవివర్మ మెడికల్ డైరెక్టర్ దీప్తి సంగరాజు మేనేజింగ్ డైరెక్టర్ ఎం. సుమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని, ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

గడి మైసమ్మను దర్శించుకున్న ఎంపీ ఈటల

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ లోని శ్రీ శ్రీ శ్రీ గడి మైసమ్మ తల్లి శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ గడి మైసమ్మ తల్లి దేవిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రుల మహోత్సవములు సందర్భంగా ఆదివారం దుర్గాదేవి అలంకరణ,లక్షపూల పూజ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పట్లోల్ల విక్రమ్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ ,మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి కోశాధికారి లవంగ శ్రీకాంత్,మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి,నాయకులు పికెట్ నర్సింగ్ రావు,ఆలయ కమిటీ సభ్యులు తాళ్ళపల్లి శివ కుమార్,అనిల్,శ్యామరావు,రాము,మిరియాల నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లిలో కౌన్సిలర్ల తిరుగుబాటు

ఎమ్మెల్యే వసంత ఆంక్షలు బేఖాతర్

నామినేషన్లతో వేడెక్కిన మున్సిపల్ రాజకీయం

కొండపల్లి(ప్రశ్న న్యూస్) కొండపల్లి మున్సిపల్ ఎన్నికల రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా? పార్టీ పెద్దల నిర్ణయాలకు క్షేత్రస్థాయి నాయకులు తలొగ్గడం లేదా? టికెట్ల కేటాయింపులో అసంతృప్తి, స్థానిక ఆధిపత్య పోరు కలిసి ఎన్నికల బరిలో కొత్త పరిణామాలకు తెరతీస్తున్నాయా? కొండపల్లి మున్సిపాలిటీలో నామినేషన్ల లెక్కలు చూస్తే ఇలాంటి ప్రశ్నలే రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ విధించినట్లు ప్రచారంలో ఉన్న ఆంక్షలను కొందరు ప్రస్తుత కౌన్సిలర్లు బేఖాతర్ చేస్తూ బరిలోకి దిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే, ఆయా ఆంక్షల స్వరూపం, వాటిపై ఎమ్మెల్యే స్పందన అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగియడంతో కొండపల్లిలో రాజకీయ వేడి తారస్థాయికి చేరింది. వార్డు కౌన్సిలర్ స్థానాలతోపాటు చైర్‌పర్సన్ పీఠం కోసం అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 213 నామినేషన్లు దాఖలైనట్లు అందిన వివరాలు చెబుతున్నాయి. పార్టీల బలాబలాల కంటే స్థానిక నాయకుల వ్యక్తిగత ప్రభావం, టికెట్ల కేటాయింపులో అసంతృప్తి, స్వతంత్ర అభ్యర్థుల రంగప్రవేశం ఈ ఎన్నికల్లో కీలకంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

టికెట్ దక్కకుంటే సొంత దారి..

పార్టీ టికెట్ వస్తేనే పోటీ చేయాలన్న సంప్రదాయానికి భిన్నంగా కొండపల్లిలో కొందరు నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వార్డు స్థానాలకు మొత్తం 203 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 75, తెలుగుదేశం పార్టీ తరఫున 65, జనసేన నుంచి 11, భారతీయ జనతా పార్టీ నుంచి ఐదు నామినేషన్లు వచ్చినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి.కాంగ్రెస్, సీపీఐ, బీఎస్పీల నుంచి ఒక్కొక్క నామినేషన్ చొప్పున, సీపీఎం నుంచి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక స్వతంత్ర అభ్యర్థులుగా 41 మంది నామినేషన్లు వేశారు. ఈ సంఖ్యే స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు కారణమవుతోంది.టికెట్ దక్కని అసంతృప్తులే స్వతంత్రులుగా బరిలోకి దిగారా? లేక స్థానికంగా తమకున్న పట్టును నిరూపించుకునేందుకు కొందరు నేతలు సొంత నిర్ణయాలు తీసుకున్నారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశం. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల అనంతరం ఎంతమంది బరిలో నిలుస్తారన్న దానిపై పోటీ స్వరూపం స్పష్టమవుతుంది.

ఎమ్మెల్యే మాటకు విలువ లేదా.?

కొండపల్లి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ రాజకీయ వ్యూహాలపై చర్చ జరుగుతోంది. పార్టీ పరంగా తీసుకున్న నిర్ణయాలు, అభ్యర్థుల ఎంపిక, స్థానిక నేతల మధ్య సమన్వయం వంటి అంశాలు ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి. ఈ క్రమంలో కొందరు ప్రస్తుత కౌన్సిలర్లు సొంత నిర్ణయాలతో నామినేషన్లు దాఖలు చేసినట్లు ప్రచారం జరుగుతుండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

దుర్గమ్మ దివ్యదర్శనం..

ఇంద్రకీలాద్రిపై భక్తజన సంద్రం

- దుర్గాదేవి అలంకారంలో జగజ్జనని.

- దర్శనానికి పోటెత్తిన భక్తులు

విజయవాడ(ప్రశ్న న్యూస్) దుర్గమ్మ నామస్మరణతో ఇంద్రకీలాద్రి మార్మోగుతోంది. దుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తున్న జగజ్జననిని కనులారా దర్శించుకునేందుకు భక్తజనం పోటెత్తుతున్నారు. అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుంటూ భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోతున్నారు. కొండపై ఎటుచూసినా ఆధ్యాత్మిక వాతావరణం.. ఆలయ ప్రాంగణంలో ఎక్కడ చూసినా భక్తుల సందడి.. అమ్మవారి దర్శనమే పరమావధిగా భక్తులు బారులు తీరుతున్నారు. దుర్గమ్మ కరుణాకటాక్షాల కోసం తరలివస్తున్న భక్తులతో విజయవాడలోని ఇంద్రకీలాద్రి భక్తిశ్రద్ధలకు ప్రతీకగా నిలుస్తోంది.దుర్గాదేవి అలంకారంలో వెలుగొందుతున్న శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దర్శన క్యూలైన్ల నిర్వహణ నుంచి తాగునీటి సరఫరా వరకు ప్రతి అంశంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో సేవలందిస్తున్నారు.

అమ్మవారి సన్నిధిలో ఆధ్యాత్మిక పరవశం..

దుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అమ్మవారిని దర్శించుకుని క్షేమసౌభాగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. కుటుంబ సమేతంగా తరలివస్తున్న భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారుతున్నాయి. అమ్మవారి సన్నిధిలో ఆధ్యాత్మికత, భక్తిభావం వెల్లివిరుస్తున్నాయి.దేవీ నవరాత్రి ఉత్సవాల వేళ అమ్మవారి వివిధ అలంకారాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తాయి. ప్రతి అలంకారం వెనుక ఉన్న అంతరార్థాన్ని స్మరించుకుంటూ భక్తులు జగజ్జననిని ఆరాధిస్తున్నారు. దుర్గాదేవి రూపంలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మను దర్శించుకోవడం తమ అదృష్టంగా భావిస్తూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ వైభవం..

పురవీధుల్లో ఆదిదంపతుల దివ్య విహారం

- భవానీ నామస్మరణతో మార్మోగిన బెజవాడ..

విజయవాడ(ప్రశ్న న్యూస్) ఒకవైపు ఇంద్రకీలాద్రిపై దుర్గాదేవి అలంకారంలో జగజ్జనని దివ్యదర్శనం.. మరోవైపు ప్రదోష వేళ పురవీధుల్లో ఆదిదంపతుల వైభవోపేత విహారం.. ఇంకోవైపు భవానీ భక్తుల జయజయధ్వానాలు! దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం విజయవాడ ఆధ్యాత్మిక శోభతో పులకించింది. కొండపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరాగా, కొండదిగువన గంగా పార్వతీ సమేత శ్రీ మల్లేశ్వర స్వామివారి దివ్య నగరోత్సవం కనులపండువగా సాగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, కర్పూర నీరాజనాల నడుమ సాగిన ఈ వేడుక బెజవాడలో భక్తిభావాన్ని వెల్లివిరిసేలా చేసింది.భక్తి, సంప్రదాయం, సంస్కృతి కలగలిసిన ఇంద్రకీలాద్రి దసరా వైభవం బెజవాడ ఆధ్యాత్మిక చరిత్రలో మరో విశిష్టమైన రోజుగా నిలిచింది.

రోడ్డు ప్రమాదంలో పూజారి దుర్మరణం

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ పరిశ్రమ పూజారి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శారద కృష్ణ (60) గత కొన్నేళ్లుగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని చెట్లగౌరారం గ్రామ పరిధిలో ఉన్న ఎంఎస్ అగర్వాల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో పూజారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పరిశ్రమ ప్రాంగణంలోనే నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం శారద కృష్ణ తన ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనంపై మేడ్చల్ వైపు వస్తుండగా దబీల్‌పూర్ చౌరస్తా సమీపంలోని పంజాబీ దాబా వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆయన ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల వేళ నాటుసారా స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం

- 3 వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం.. 3 లీటర్ల నాటుసారా స్వాధీనం

- దొర్లతాడివలస పరిసరాల్లో ఆకస్మిక దాడులు.. - అక్రమ తయారీదారుల కోసం గాలింపు

పార్వతీపురం(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల వేళ అక్రమ నాటుసారా తయారీ, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు మద్యం వినియోగించే అవకాశాలను అడ్డుకోవడంతోపాటు, అక్రమ సారా తయారీ కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సాలూరు మండలంలోని దొర్లతాడివలస పరిసర ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి భారీ మొత్తంలో బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సుమారు 3,000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతోపాటు, మూడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ చట్టం కింద కేసు నమోదు చేశారు.

డ్రమ్ముల కొద్దీ ఊట.. ఎన్నికల వేళ కలకలం

స్థానిక సంస్థల ఎన్నికలు-2026 నేపథ్యంలో అక్రమ మద్యం తయారీ, విక్రయాలను నియంత్రించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్‌రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు పార్వతీపురం సబ్ డివిజన్ డీఎస్పీ సీహెచ్.వి. శేషయ్య ఆధ్వర్యంలో సాలూరు సర్కిల్ పోలీసులు రంగంలోకి దిగారు.సాలూరు మండలం దొర్లతాడివలస పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నాటుసారా తయారీకి ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన స్థావరాలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 15 డ్రమ్ముల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. దాదాపు 3,000 లీటర్ల ఊటను ధ్వంసం చేయడం, మూడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం ఈ దాడుల్లో కీలక పరిణామాలుగా నిలిచాయి.తయారీదారుల కోసం గాలింపుఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. నాటుసారా తయారీ, నిల్వ, విక్రయాల వెనుక ఉన్నవారిని గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ సీహెచ్.వి. శేషయ్య తెలిపారు. అక్రమ సారా కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా సాగడమే లక్ష్యం

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమ మద్యం వినియోగించే అవకాశాలను అడ్డుకోవడం పోలీసుల ముందున్న కీలక బాధ్యత. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అక్రమ కార్యకలాపాలపై నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.నాటుసారా తయారీ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమ కార్యకలాపాల నియంత్రణలో ప్రజలు సహకరించాలని కోరారు.ఈ దాడుల్లో పార్వతీపురం సబ్ డివిజన్ డీఎస్పీ సీహెచ్.వి. శేషయ్య, సాలూరు సీఐ పి. రామకృష్ణ, సాలూరు రూరల్ ఎస్ఐ బి. రవీంద్రరాజు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ..

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయ పండుగ

తొమ్మిది రోజుల సంబరాలకు ముగింపు.. ప్రకృతికి పూల నీరాజనం.. ఆడబిడ్డల ఐక్యతకు ప్రతీక బతుకమ్మ

(ప్రజా ప్రశ్న పాఠకులకు ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ బతుకమ్మ. తీరొక్క పూలను సేకరించి, అందంగా బతుకమ్మను పేర్చి, పాటలు పాడుతూ, ఆటలాడుతూ మహిళలు జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుంది. తొమ్మిది రోజులపాటు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో చివరి రోజును సద్దుల బతుకమ్మగా జరుపుకుంటారు. ఈ రోజుతో బతుకమ్మ సంబరాలు వైభవంగా ముగుస్తాయి.

సద్దుల బతుకమ్మ ప్రత్యేకత ఏమిటి.?

బతుకమ్మ పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. ఈ రోజున మహిళలు తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో పెద్ద బతుకమ్మలను అందంగా పేర్చుతారు. పూలను వరుసలుగా అమర్చి మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేస్తారు.కాలనీలు, గ్రామాలు, వీధుల్లో మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడతారు. చప్పట్లతో లయబద్ధంగా అడుగులు వేస్తూ ఆటపాటలతో సందడి చేస్తారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ కలిసి పాల్గొనడం ఈ పండుగలోని ప్రత్యేకత సాధారణంగా తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకల్లో ప్రతిరోజూ ఒక్కో ప్రత్యేకత ఉండగా, చివరి రోజైన సద్దుల బతుకమ్మను మరింత వైభవంగా నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆడపడుచులు కలిసి పండుగను ఆనందంగా జరుపుకుంటారు.

తొమ్మిది రకాల నైవేద్యాలతో సద్దుల బతుకమ్మ

సద్దుల బతుకమ్మ రోజున ఐదు రకాల సద్దులు లేదా ప్రాంతీయ సంప్రదాయాన్ని బట్టి వివిధ రకాల అన్నపు నైవేద్యాలను అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీ. సాధారణంగా పెరుగన్నం, పులిహోర, నువ్వుల అన్నం, కొబ్బరి అన్నం, నిమ్మకాయ అన్నం వంటి వంటకాలను తయారు చేస్తారు. ప్రాంతాన్ని, కుటుంబ ఆచారాలను బట్టి నైవేద్యాల్లో మార్పులు ఉంటాయి. ఈ నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో బతుకమ్మకు సమర్పించి, అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో పంచుకుంటారు. ఇలా ఆహారాన్ని పంచుకోవడం ద్వారా పరస్పర ప్రేమాభిమానాలు, ఐక్యత మరింత బలపడతాయి.

ప్రకృతికి పూలతో చేసే పూజ

బతుకమ్మ పండుగలో ఉపయోగించే పూలకు ప్రకృతితో విడదీయలేని అనుబంధం ఉంది. ముఖ్యంగా వర్షాకాలం ముగిసే సమయంలో పల్లెల్లో, పొలాల గట్లపై, చెరువుల పరిసరాల్లో సహజంగా లభించే తంగేడు, గునుగు వంటి పూలతో బతుకమ్మను అలంకరిస్తారు.

ప్రకృతిలో లభించే పూలను పూజించడం ద్వారా ప్రకృతి పట్ల కృతజ్ఞతను చాటుతారు. చెరువులు, నీటి వనరులు, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను కూడా ఈ పండుగ గుర్తుచేస్తుంది. పూల అందాలతో బతుకమ్మను పేర్చడం తెలంగాణ మహిళల సృజనాత్మకతకు నిదర్శనం.

ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీక

బతుకమ్మ పండుగ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. ఆడబిడ్డల అనుబంధాలకు, కుటుంబ బంధాలకు ప్రతీక. పెళ్లయి అత్తవారింటికి వెళ్లిన ఆడపడుచులు పుట్టింటికి చేరుకుని తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లతో ఆనందంగా గడుపుతారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, బతుకమ్మ పాటల్లో తమ సంతోషాలను, బాధలను, కుటుంబ అనుబంధాలను వ్యక్తపరుస్తారు. ఒకరినొకరు పలకరించుకుంటూ, కష్టసుఖాలను పంచుకుంటూ ఆత్మీయతను చాటుకుంటారు.నేటి ఉరుకుల పరుగుల జీవితంలో బంధుమిత్రులతో కలిసి గడిపే సమయం తగ్గిపోతున్న తరుణంలో బతుకమ్మ పండుగ కుటుంబాలను, సమాజాన్ని ఒకచోట చేర్చే గొప్ప సంప్రదాయంగా నిలుస్తోంది.

బతుకమ్మ నిమజ్జనంతో ముగింపు

సాయంత్రం వేళ మహిళలంతా బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి

చెరువులు, కుంటలు లేదా ఇతర అనువైన నీటి ప్రదేశాల వద్ద సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేస్తారు. బతుకమ్మకు వీడ్కోలు పలుకుతూ మరో ఏడాది మళ్లీ రావాలని కోరుకుంటారు.

నిమజ్జనం సందర్భంగా నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను నీటిలో వేయకుండా జాగ్రత్తపడటం కూడా మనందరి బాధ్యత. పండుగ ఆనందంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి.

తెలంగాణ సంస్కృతికి సద్దుల బతుకమ్మ మకుటాయమానం

సద్దుల బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంప్రదాయాలకు, ఐక్యతకు ప్రతీక. పూలను పూజించడం ద్వారా ప్రకృతిని గౌరవించడం, నైవేద్యాలను పంచుకోవడం ద్వారా ఆప్యాయతను పెంపొందించడం, పాటలు, ఆటలతో సంస్కృతిని తరువాతి తరాలకు అందించడం ఈ పండుగలోని గొప్ప సందేశాలు.

మహాగౌరి కరుణాకటాక్షం..

నందివాహనంపై స్వామి అమ్మవార్లు

- శ్రీశైలంలో అష్టమి నవరాత్రి వైభవం.. - భక్తిభావంతో విశేష పూజలు
- కుమారీ పూజలు.. చండీహోమాలు..
- రుద్రయాగాలు.. కనువిందు చేయనున్న సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైలం(ప్రశ్న న్యూస్) శ్రీశైల క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం భ్రమరాంబ అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు, హోమాలు, జపానుష్ఠానాలు నిర్వహించారు. నవదుర్గలలో ఎనిమిదవ స్వరూపమైన శ్రీ మహాగౌరీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనుండగా.. రాత్రి నందివాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవం వైభవంగా జరగనుంది. ఆలయ ప్రాంగణం వేదమంత్రాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మార్మోగుతోంది.

మహాగౌరి రూపంలో అమ్మవారి అనుగ్రహం

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబ అమ్మవారిని మహాగౌరీ స్వరూపంలో అలంకరిస్తారు. నవదుర్గలలో ఎనిమిదవ రూపమైన మహాగౌరి శాంతి, పవిత్రత, కరుణకు ప్రతీకగా భక్తులు ఆరాధిస్తారు. తెల్లని వస్త్రధారణతో, నాలుగు భుజాలతో దర్శనమిచ్చే ఈ దేవి చేతుల్లో త్రిశూలం, డమరుకం ఉండగా.. అభయ, వరద ముద్రలతో భక్తులకు ఆశీస్సులు అందిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి.పార్వతీదేవి పరమశివుడిని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేయగా, ఆమె తపస్సుకు మెచ్చిన శివుడు గంగాజలాన్ని చిలకరించడంతో దేహం ప్రకాశవంతమైన గౌరవర్ణంతో వెలిగిందని పురాణగాథ. అందుకే ఆమెకు మహాగౌరి అనే పేరు వచ్చిందని భక్తుల విశ్వాసం. ఈ రూపాన్ని ఆరాధించడం వల్ల కష్టాలు తొలగి, సుఖశాంతులు కలుగుతాయని భక్తులు నమ్ముతారు.

విశేష పూజలు.. చండీహోమాలు

అష్టమి సందర్భంగా ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజలతో పాటు విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణాలు నిర్వహించారు. సూర్యనమస్కారాలు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరీ, బాలా జపానుష్ఠానాలతో పాటు చండీ, చతుర్వేద పారాయణాలు, కుమారీపూజలు జరిపించారు. రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణాలు నిర్వహించారు.సాయంత్రం నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం తదితర ధార్మిక కార్యక్రమాలు కొనసాగనున్నాయి.శ్రీశైల స్వామి అమ్మవార్ల ఆలయ గ్రామోత్సవంలోనూ సంప్రదాయ కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. నాదస్వరం, కేరళ చండీ మేళం, కొమ్ము, కోయ నృత్యం, థయ్యం, కోలాటం, చెక్కభజన, తప్పెట చిందు, డోలు విన్యాసాలు, వీరభద్ర డోలుకుణిత వంటి ప్రదర్శనలు భక్తులను అలరించనున్నాయి.అశ్వ ప్రదర్శన, రాజభటుల వేషాలు, జానపద పగటి వేషాలు, అమ్మవారి వేషధారణ, శంఖనాదం, డమరుకం, చిడతలు తదితర కళారూపాలతో గ్రామోత్సవం సంప్రదాయ వైభవాన్ని చాటనుంది.

చంటిపిల్లలకు అమ్మ ఒడి..

భక్తులకు వేడి పాలు

- దసరా రద్దీలోనూ చిన్నారుల ఆకలి తీర్చేలా ఈవో శీనా నాయక్ ప్రత్యేక చొరవ
- క్యూలైన్లలోనే పాల పంపిణీ.. స్వయంగా చిన్నారిని ఎత్తుకుని పాలు అందించిన: ఈవో

విజయవాడ(ప్రశ్న న్యూస్) భక్తి మార్గంలో సేవాభావం.. రద్దీ వేళలోనూ చిన్నారుల పట్ల మానవత్వం! ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు తరలివస్తున్న భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో భాగంగా చిన్నారులు, చంటిపిల్లల తల్లులకు వేడి పాలు పంపిణీ చేసే ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. దుర్గమ్మ దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఈవో శీనా నాయక్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఘాట్ రోడ్డు, క్యూలైన్లలో భక్తులకు వేడి పాలు అందించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రద్దీలోనూ చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ

దసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రికి భక్తులు భారీగా తరలివస్తుండటంతో క్యూలైన్లలో చిన్నారులతో వచ్చే కుటుంబాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా చంటిపిల్లల తల్లులు, చిన్నారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేడి పాలు అందించాలని ఈవో నిర్ణయించారు. ఇందుకోసం పాలను అప్పటికప్పుడు వేడి చేసి భక్తులకు అందించేలా ఏర్పాట్లు చేశారు. ఘాట్ రోడ్డు పరిసరాలతోపాటు క్యూలైన్లలోనూ పాలు పంపిణీ కొనసాగించారు.

స్వయంగా చిన్నారికి పాలు అందించిన ఈవో..

ఏర్పాట్లను పర్యవేక్షించడానికే పరిమితం కాకుండా ఈవో శీనా నాయక్ స్వయంగా భక్తులకు పాలు అందించారు. క్యూలైన్లో ఉన్న ఓ చిన్నారిని ఎత్తుకుని ఆ చిన్నారికి వేడి పాలు అందించిన తీరు అక్కడున్న వారిని ఆకట్టుకుంది. దుర్గమ్మ దర్శనం కోసం వచ్చిన భక్తులకు, ముఖ్యంగా చిన్నపిల్లలతో వచ్చిన తల్లులకు అవసరమైన సహాయం అందించాలన్న ఆయన చొరవ ఈ కార్యక్రమంలో కనిపించింది.

సేవలో 'హెల్పింగ్ హ్యాండ్స్' భాగస్వామ్యం

దేవస్థానం ఈవో శీనా నాయక్ సమన్వయంతో 'హెల్పింగ్ హ్యాండ్స్' బృందం క్యూలైన్లలోని భక్తులకు వేడి పాలు అందించింది. భక్తుల అవసరాలను గుర్తిస్తూ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించారు. రద్దీ సమయంలో చిన్నారుల సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ, భక్తులకు సాధ్యమైనంత సౌకర్యవంతమైన దర్శన అనుభవం కల్పించడమే లక్ష్యంగా ఈ ఏర్పాట్లు చేపట్టారు.

జనసేన కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు

- ఆటపాటలతో తెలంగాణ సంస్కృతి వైభవం

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వీర మహిళా నాయకురాలు శ్రీమతి నిహారిక నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ మహిళా నాయకులు సంప్రదాయ బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ పూల పండుగ ప్రత్యేకతను చాటుతూ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవనశైలికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరిన వీర మహిళలు పాటలు పాడుతూ ఆటలాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పండుగ వాతావరణం రాష్ట్ర కార్యాలయంలో సందడి నింపింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలకమని పార్టీ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వీర మహిళ రాష్ట్ర నాయకురాళ్లు కావ్య, రత్న పిల్ల, పద్మజ, వెంకటలక్ష్మి, అరుణకుమారి, శాంతి, శ్రావణి, కీర్తి, స్వాతిరెడ్డి, రజిని, మాధవి, భవ్య, లక్ష్మి, రాణి, డాక్టర్ పద్మజాదేవి, రాజ్యలక్ష్మి, లావణ్య, అనసూయ, శ్రీదేవి తదితరులు పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో అలరించారు.

గుంటూరు మేయర్ పీఠంపై

టీడీపీ వ్యూహాత్మక అడుగు

- కార్యకర్తల అభిప్రాయాలకే పెద్దపీట..
- కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు కూటమి పగ్గాలు

గుంటూరు(ప్రశ్న న్యూస్) గుంటూరు నగర మేయర్ అభ్యర్థి ఎంపికతో కూటమి రాజకీయాల్లో కార్యకర్తల అభిప్రాయాలు, పార్టీ విధేయత, నాయకత్వ నిర్ణయాల ప్రాధాన్యం మరోసారి చర్చకు వచ్చింది. కూటమి అభ్యర్థిగా కోవెలమూడి లక్ష్మీ అపర్ణ నామినేషన్ దాఖలు చేయగా, ఈ ఎంపిక వెనుక కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇచ్చామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ పార్టీకి అండగా నిలిచిన నాయకుల సేవలను గుర్తించడం తెలుగుదేశం పార్టీ ప్రత్యేకతగా ఆయన అభివర్ణించారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు..

గుంటూరు మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి లక్ష్మీ అపర్ణను ఎంపిక చేయడం సంతోషకరమని పెమ్మసాని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత దాదాపు 15 ఏళ్లుగా గుంటూరు ప్రాంతంలో టీడీపీకి అండగా నిలిచి, పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ కష్టపడి పనిచేసిన నాని సేవలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.పార్టీ నాయకత్వం తమ నిర్ణయాలను కార్యకర్తలపై రుద్దడం కాకుండా, వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యమని ఆయన వ్యాఖ్యానించారు. ఐవీఆర్ఎస్ ద్వారా కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి, నాయకులు, ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణుల అభిప్రాయాలకు గౌరవం ఇవ్వడమే టీడీపీ విధానమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మొహమ్మద్ నసీర్ అహ్మద్, బి. రామాంజనేయులు, టీడీపీ నాయకుడు తాడిశెట్టి మురళి, గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు తిరుపతయ్య, జనసేన నాయకుడు కిలారి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పీఠమే లక్ష్యంగా వంగవీటి అడుగు

- చంద్రబాబు, పవన్ అండతో రాజకీయ సమరానికి సిద్ధం

విజయవాడ(ప్రశ్న న్యూస్) బెజవాడ రాజకీయాల్లో మళ్లీ వంగవీటి పేరు మార్మోగింది! విజయవాడ మేయర్ పీఠాన్ని లక్ష్యంగా చేసుకుని కూటమి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ ఎన్నికల బరిలోకి దిగారు. భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేయడం ద్వారా తన రాజకీయ సమరానికి తెరతీశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి మద్దతుతో ఆయన పోటీకి దిగడంతో నగర రాజకీయాల్లో కొత్త ఉత్కంఠ నెలకొంది. ఈ పోరు కేవలం మేయర్ పదవికే పరిమితం కాకుండా.. కూటమి ఐక్యతకు, ప్రతిపక్షాల రాజకీయ బలాబలాలకు పరీక్షగా మారనుంది.

ర్యాలీతో రాజకీయ సందడి.. బలప్రదర్శనకు సంకేతమా.?

నామినేషన్ల దాఖలుకు చివరి రోజున వంగవీటి రాధాకృష్ణ తన కార్యాలయం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ఎన్నికల పోరులో తన ఉనికిని చాటడంతోపాటు కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. విజయవాడలో వంగవీటి కుటుంబానికి ఉన్న రాజకీయ నేపథ్యం, రాధాకృష్ణకు ఉన్న పరిచయాలు ఈ ఎన్నికల్లో ఏ మేరకు ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

చంద్రబాబు--పవన్ విశ్వాసం.. నిలబెట్టుకోవడమే సవాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనకు అవకాశం కల్పించినందుకు రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఎన్నికల్లో విజయం సాధిస్తాననే విశ్వాసం ఉందని ప్రకటించారు. నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యేల సహకారాన్ని తీసుకుంటానని చెప్పారు.అయితే, కూటమి అభ్యర్థిగా బరిలో దిగడం ఒక ఎత్తయితే.. మూడు పార్టీల నాయకులు, కేడర్‌ను సమన్వయం చేసుకుని ఓట్లుగా మలచడం మరో ఎత్తు. స్థానికంగా పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, అభ్యర్థికి లభించే మద్దతు, ఓటర్లను ఆకట్టుకునే ప్రచార వ్యూహం ఫలితాన్ని ప్రభావితం చేయనున్నాయి. కూటమి ఐక్యతను ఓట్లుగా మలచడం, స్థానిక సమీకరణాలను తనకు అనుకూలంగా మార్చుకోవడం, నగర ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం ఆయన ముందున్న ప్రధాన సవాళ్లు. ర్యాలీతో మొదలైన రాజకీయ సందడి.. ఎన్నికల ఫలితాల్లో విజయంగా మారుతుందా? బెజవాడ మేయర్ పీఠంపై ఎవరి జెండా ఎగురుతుంది? అన్నది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

స్థానిక పోరులో కూటమి ఐక్య సమరం

- వైకాపా ఓటమి భయంతోనే వాయిదా పిటిషన్లు
- హింసకు దిగుతోందని నల్లమిల్లి విమర్శలు

కాకినాడ(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతాయని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తరఫున పోటీ చేసే అభ్యర్థులకు బీ-ఫారాలు జారీ చేసే అధికారాన్ని పార్టీ అధిష్ఠానం తనకు అప్పగించిందని తెలిపారు. కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్‌కు ఫారమ్-ఏ అందజేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఐక్యంగా స్థానిక ఎన్నికలను ఎదుర్కొంటాయని పేర్కొన్నారు.

ఎన్నికలకు వైకాపా భయపడుతోందని విమర్శలు..

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలై, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో వైకాపా ఎన్నికలను వాయిదా వేయించేందుకు ప్రయత్నిస్తోందని నల్లమిల్లి ఆరోపించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, గతంలో వైకాపా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. రిజర్వేషన్ల అంశంపై న్యాయస్థానాల్లో సవాళ్లు, ఎన్నికల వాయిదా కోరుతూ పిటిషన్లు వేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు.

హింసతో ప్రజలను భయపెట్టలేరు..

తిరుపతి, పుంగనూరు, రాయచోటిలో చోటుచేసుకున్న ఘటనలను ప్రస్తావిస్తూ ఎన్నికల సమయంలో హింసాత్మక వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని నల్లమిల్లి ఆరోపించారు. టీడీపీ శ్రేణులపైకి వాహనం నడిపిన ఘటన, రాష్ట్ర మంత్రిని హత్య చేసేందుకు కుట్ర జరిగిందన్న ఆరోపణలపై ప్రస్తావిస్తూ వైకాపా తీరుపై విమర్శలు గుప్పించారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు, దర్యాప్తు నిర్ధారణలు అధికారికంగా స్పష్టమవ్వాల్సి ఉంది.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, సీనియర్ నాయకుడు మాలకొండయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయిరెడ్డి తప్పుడు ప్రచారాలకు

కూటమి ఐక్యతే సమాధానం

- విజయసాయి రెడ్డిపై కేశినేని చిన్ని ఘాటు విమర్శలు
- విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధా గెలుపు ఖాయమని ధీమా

విజయవాడ(ప్రశ్న న్యూస్) రాజకీయాల్లో ఉనికి చాటుకోవడానికి కొందరు తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలనే ఆయుధాలుగా వాడుకుంటున్నారని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని విమర్శించారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి లక్ష్యంగా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విజయవాడ మేయర్ అభ్యర్థిగా రిటైర్డ్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు పోటీ చేయడం వెనుక తెలుగుదేశం పార్టీ ఉందంటూ ప్రచారం చేయడం సరికాదని మండిపడ్డారు. వ్యక్తిగత హోదాలో పోటీ చేస్తున్న ఒక మాజీ అధికారికి టీడీపీతో సంబంధం అంటగట్టడం రాజకీయ కుట్రలో భాగమేనని విమర్శించారు.విజయసాయిరెడ్డి తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలతో రాజకీయంగా ఉనికి చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేశినేని చిన్ని ఆరోపించారు. ఇలాంటి ప్రచారాలతో కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించాలనే ప్రయత్నాలు ఫలించబోవని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీకి పన్నాగాలు, కుతంత్రాలు చేయాల్సిన అవసరం లేదని, ప్రజల మద్దతుతోనే కూటమి ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

కూటమిని విడదీయడం ఎవరి తరం కాదు..

2014--19 మధ్య బీజేపీ నుంచి టీడీపీని దూరం చేయడానికి కుట్రలు చేశానని విజయసాయిరెడ్డి గతంలో స్వయంగా చెప్పుకున్నారని కేశినేని చిన్ని తన విమర్శల్లో ప్రస్తావించారు. ఇప్పుడు కూడా కూటమి పార్టీల ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అయితే ఎన్ని ప్రచారాలు చేసినా కూటమి ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రజలు ఇకపై ఏ1, ఏ2 అంటూ రాజకీయ విమర్శలు చేసుకునే వారి మాటలను నమ్మే పరిస్థితిలో లేరని కేశినేని చిన్ని వ్యాఖ్యానించారు. రాజకీయంగా బురదజల్లే ప్రయత్నాలు చేసినంత మాత్రాన ప్రజాభిప్రాయాన్ని మార్చలేరని అన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల్లో విజయాన్ని సాధిస్తారని పేర్కొన్నారు.వంగవీటి రాధా గెలుపే లక్ష్యం!విజయవాడ మేయర్ ఎన్నికల్లో వంగవీటి రాధాను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడమే కూటమి లక్ష్యమని కేశినేని చిన్ని స్పష్టం చేశారు. నగర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతామని తెలిపారు. కూటమి అభ్యర్థుల విజయంతో తప్పుడు ప్రచారాలకు ప్రజలే సమాధానం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు.

పండుగ పూట కరెంట్ కోతలు..

చీకట్లోనే బతుకమ్మ ఆడిన మహిళలు

బతుకమ్మ పండుగ అంటేనే రంగురంగుల పూలు.. ఆటపాటలు.. ఆడపడుచుల సందడి! తెలంగాణ ప్రజలకు అత్యంత ముఖ్యమైన ఈ పండుగ వేళ వెలుగులు విరజిమ్మాల్సిన చోట చీకట్లు అలుముకున్నాయి. ఆటపాటలతో సందడిగా సాగాల్సిన బతుకమ్మ వేడుకలకు కరెంట్ కోతలతో చీకట్లు అలుముకున్నాయి. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామంలో బతుకమ్మ ఆడే సమయంలో కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లతోనే బతుకమ్మ ఆడాల్సి వచ్చింది. ఈ ఘటనపై జయ్యారం గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పండుగ సమయంలో కూడా కరెంటు కోతలు విధించడమేంటని మండిపడుతున్నారు. పండుగ వేళల్లోనైనా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభాస్ 'స్పిరిట్' విడుదల వాయిదా..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'స్పిరిట్' సినిమాకు సంబంధించి దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కీలక ప్రకటన చేశారు. ఈ చిత్రం కొత్త విడుదల తేదీని ఖరారు చేయడంతో పాటు ప్రభాస్ కొత్త లుక్‌తో కూడిన పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. దీని ప్రకారం 'స్పిరిట్' సినిమా 2027, అక్టోబర్ 29న దీపావళి పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ ప్రకటనతో భారత సినీ పరిశ్రమలో ఒక ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఇవాళ ఉదయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా సందీప్ వంగా అభిమానులను ఊరించారు. "ప్రభాస్ అన్న అభిమానులకు, సరికొత్త రిలీజ్ డేట్‌తో కూడిన ఒక కొత్త పోస్టర్‌ను పరిచయం చేయబోతున్నాను" అంటూ ట్వీట్ చేసి ఉత్కంఠను పెంచారు. ఆ తర్వాత కొద్ది నిమిషాలకే ప్రభాస్ సీరియస్ లుక్‌తో ఉన్న పోస్టర్‌ను విడుదల చేసి, "2027 అక్టోబర్ 29న దీపావళికి ప్రపంచవ్యాప్తంగా విడుదల" అని అధికారికంగా ప్రకటించారు. వాస్తవానికి ఈ సినిమాను మొదట 2027 మార్చి 5న విడుదల చేయాలని భావించినా, తాజా మార్పులతో దీపావళి బరిలో నిలిపారు. ఈ నిర్ణయంతో 'స్పిరిట్' సినిమా బాక్సాఫీస్ వద్ద మరో భారీ చిత్రంతో పోటీ పడటం ఖాయమైపోయింది.

నితేశ్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ పార్ట్ 2' కూడా 2027 దీపావళికే రానుంది. 'రామాయణ' మొదటి భాగం 2026 నవంబర్‌లో విడుదల కానుండగా, రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేస్తామని నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. ఇంకా కచ్చితమైన తేదీని వెల్లడించనప్పటికీ, అదే పండుగ సీజన్‌ను లక్ష్యంగా చేసుకోవడంతో 'స్పిరిట్', 'రామాయణ 2' మధ్య బాక్సాఫీస్ వద్ద భారీ క్లాష్ తప్పదని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఒకవైపు 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత సందీప్ వంగా దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్, మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిని రేపుతున్న పౌరాణిక గాథ కావడంతో ఈ పోటీ సినీ ప్రియులకు అసలైన పండుగ కానుంది.

జైలర్-2 అంచనాల్ని నిలబెట్టింది

ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాల్ని సాధిస్తున్నది. ప్రస్తుతం డిస్ట్రిబ్యూటర్లకు లాభాలు రావడం చాలా అరుదు. కానీ ఈ సినిమా విషయంలో వారందరూ సంతోషంగా ఉన్నారు' అని చెప్పారు అగ్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన 'జైలర్-2' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా ఉభయ తెలుగు రాష్ట్రాల హక్కులను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగవంశీ మాట్లాడారు. 'జైలర్-2' విషయంలో తమ అంచనాలన్నీ నిజమయ్యాయని, విడుదలైన అన్ని కేంద్రాల్లో మొదటి షో నుంచే భారీ వసూళ్లు సాధిస్తున్నదని ఆనందం వ్యక్తం చేశారు. విజయదశమి రోజున బ్రేక్ ఈవెన్ సాధించి లాభాల బాట పడతామనే నమ్మకం ఉందని ఈ చిత్రాన్ని నైజాంలో రిలీజ్ చేసిన మైత్రి శశి తెలిపారు.

షూటింగ్ పూర్తి చేసుకున్న పూరి- విజయ్ సేతుపతి

'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్!

క్రేజీ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్'. ఈ సినిమా షూటింగ్ తాజాగా కంప్లీట్ అయింది. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ మొత్తం పూర్తయినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ప్రేక్షకులను భావోద్వేగాల సుడిగండంలోకి తీసుకెళ్లేలా ఈ సినిమా ఉండబోతోందని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టబు, జరీనా వహాబ్, సంయుక్త మీనన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రమేష్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. విజయ్ సేతుపతి -- పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై సినిమా వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఓటీటీలోకి 'ది ప్యారడైజ్'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన భారీ మాస్ యాక్షన్ డ్రామా చిత్రం 'ది ప్యారడైజ్' ఇటీవల థియేటర్లలో అలరించిన ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ద్వారా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా అక్టోబర్ 22 నుండి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. థియేట్రికల్ విడుదలైన కేవలం నాలుగు వారాల వ్యవధిలోనే ఈ చిత్రం ఓటీటీలోకి వస్తుండటం విశేషం. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం అందుబాటులో ఉండనుంది. అలాగే 4k డాల్బీ విజన్ హెచ్‌డీఆర్ , డాల్బీ డిజిటల్ ప్లస్ ఆడియో కంటెంట్ డీటెయిల్స్‌తో హై క్వాలిటీలో అలరించనుంది.

ఆకాశం హద్దులు దాటి..

అలాంటి సమయంలో కృష్ణ అనే వ్యక్తి ఆమెకు అండగా నిలుస్తాడు. కల్పన కలల సాకారానికి భరోసాగా ఉంటాడు. ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే ఓ అమ్మాయి ఎలాంటి విజయాలు సాధిస్తుందో నిరూపిస్తాడు. మహిళా సాధికారత, ఆత్మవిశ్వాసం చాటిచెప్పే ఇలాంటి కథతో తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆకాశంలో ఒక తార'. దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి పవన్ సాధినేని దర్శకుడు. సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మాతలు. శనివారం టీజర్‌ను విడుదల చేశారు. గ్రామం పరిధులు దాటలేని ఓ అమ్మాయి ఆకాశమే హద్దుగా తన కలల్ని సాకారం చేసుకునే వైనాన్ని ఆవిష్కరిస్తూ టీజర్ ఆద్యంతం స్ఫూర్తివంతంగా, భావోద్వేగాలతో సాగింది. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు. శృతిహాసన్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, సమర్పణ: గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, రచన: గంగరాజు గుణ్ణం, దర్శకత్వం: పవన్ సాధినేని.

జ్ఞాపకాల వెల్లువలో హైకూ

ఏగన్, 'కోర్ట్' ఫేమ్ శ్రీదేవి, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహించారు. డి.అరుళానందు, మాథ్యూ అరుళానందు నిర్మాతలు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరులో సమావేశంలో కథానాయిక శ్రీదేవి మాట్లాడుతూ. .తన హృదయానికి ఎంతో దగ్గరైన చిత్రమిదని, ప్రేమలోని సంఘర్షణ, మధుర జ్ఞాపకాలను ఆవిష్కరిస్తుందని చెప్పింది. నిజాయతీతో కూడిన ప్రేమకథ ఇదని, కాలేజీ జీవితంలోని అందమైన అనుభవాల్ని చూపించారని కోన వెంకట్ తెలిపారు. తమిళంలో మాదిరిగానే తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరిస్తారనే నమ్మకం ఉందని హీరో ఏగెన్ పేర్కొన్నారు.

'ఐ హేట్ మ్యారేజ్' టీజర్ విడుదల..

జెన్ జీ ఆలోచనలతో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్!

నేటి తరంలో ప్రేమ, పెళ్లి, కెరీర్ మరియు స్వతంత్ర జీవనంపై యువత ఆలోచనలను ప్రతిబింబిస్తూ తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఐ హేట్ మ్యారేజ్' సుగి విజయ్, జుప్సీ భద్ర జంటగా నటిస్తున్న ఈ చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన 'అప్పుడే పెళ్లా' లిరికల్ వీడియో సాంగ్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన లభించడమే కాకుండా ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర యూనిట్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది. టీజర్ విడుదల సందర్భంగా దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల మాట్లాడుతూ.. "ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి జెన్ జెడ్ తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నమే ఈ చిత్రం. జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఇందులో ఉంటుంది. ప్రతి యువత ఈ సినిమాలోని పాత్రలతో కనెక్ట్ అవుతారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఇదొక చక్కటి అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి, ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్, బేబి తమోఘ్న, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని విజయ్ సి. కుమార్ అందించగా, సంగీతం మరియు పాటలను వరికుప్పల యాదగిరి సమకూర్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ప్రవీణ్ ఇమ్మడి అందించగా, ఎడిటింగ్ బాధ్యతలను ఆవుల వెంకటేష్ నిర్వహించారు. ఆర్ట్ డైరెక్టర్‌గా మోహన్ జల్లా వ్యవహరించగా, అడిషనల్ డైలాగ్స్‌ను శ్రీనివాస్ తేజ అందించారు. అల్లు చాణక్య, రాజ్ కృష్ణ కొరియోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి దయానంద్ మాదం, కార్తిక్ వెంపటి నిర్మాతలుగా వ్యవహరించగా, సంతోష్ రేణికుంట్ల, కాశీగారి కోదండ రామ శర్మ సహ నిర్మాతలుగా ఉన్నారు. రచన, మాటలు, స్క్రీన్‌ప్లే సమకూర్చడంతో పాటు పరమేశ్ రేణుకుంట్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

3 రోజుల్లో రూ.300 కోట్లు.. బాక్సాఫీసు వద్ద 'జైలర్-2' మేనియా



సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన స్టామినా ఏంటో నిరూపిస్తున్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'జైలర్ 2' చిత్రం విడుదలైన కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా తొలి మూడు రోజుల్లోనే రూ. 300 కోట్ల మైలురాయిని దాటి సరికొత్త రికార్డులు నెలకొల్పింది.విడుదలైన మొదటి రోజు నుంచే 'జైలర్ 2' హవా స్పష్టంగా కనిపించింది. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 125 కోట్ల గ్రాస్ వసూలు చేసిన ఈ చిత్రం, రెండో రోజు రూ. 85 కోట్లు రాబట్టింది. ఇక మూడో రోజు శనివారం నాడు వసూళ్లు మళ్లీ పుంజుకొని ఏకంగా రూ. 108 కోట్లకు చేరాయి. దీంతో మూడు రోజుల్లో మొత్తం గ్రాస్ రూ. 318 కోట్లకు చేరినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. తొలి వారాంతంలోనే రెండుసార్లు ఒకే రోజులో రూ. 100 కోట్లకు పైగా గ్రాస్ సాధించడం రజనీకాంత్ సినిమాకే చెల్లిందని విశ్లేషకులు చెబుతున్నారు.భారత్‌లోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'జైలర్ 2' అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. ప్రీమియర్‌లతో కలిపి కేవలం మూడు రోజుల్లోనే విదేశీ మార్కెట్ల నుంచి ఈ సినిమా రూ. 155 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇది భారతీయ సినిమాకు అపూర్వమైన విజయంగా పరిగణిస్తున్నారు. ప్రస్తుత ట్రెండ్ చూస్తుంటే, ఆదివారం కూడా ఈ చిత్రం రూ. 100 కోట్ల మార్కును దాటే అవకాశం ఉందని, దీంతో నాలుగు రోజుల లాంగ్ వీకెండ్ ముగిసేసరికి ప్రపంచవ్యాప్తంగా మొత్తం వసూళ్లు రూ. 420 కోట్లు దాటవచ్చని అంచనా వేస్తున్నారు. హిందీ బెల్ట్‌లోనూ పీవీఆర్ ఐనాక్స్, సినీపొలిస్, మిరాజ్ వంటి ప్రధాన మల్టీప్లెక్స్ చైన్‌లలో విడుదల కానప్పటికీ, మూడు రోజుల్లో రూ. 10.50 కోట్ల నెట్ వసూళ్లు సాధించడం విశేషం. ఈ గణాంకాలు చూస్తుంటే, 'జైలర్ 2' మెగా బ్లాక్‌బస్టర్‌గా నిలవడం ఖాయమని స్పష్టమవుతోంది.

ఘనంగా సద్దుల బతుకమ్మ

బడంగ్ పేట్(ప్రశ్న న్యూస్) సబితా ఇంద్రా రెడ్డి కాలనీ ఫేస్ 2 లో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులపాటు ఆత్యంత కోలాహలంగా సాగిన బతుకమ్మ వేడుకలు సద్దుల బతుకమ్మ తో ఘనంగా ముగిసాయి. బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలు సాంప్రదాయబద్ధంగా వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి కాలనీ మధ్యలో ఆహ్లాదకర వాతావరణంలో ఆడి పాడి సందడి చేసారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా బతుకమ్మలను నిమజ్జనం చేసి ప్రసాదాలను పంచుకున్నారు.

శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

నాచారం (ప్రశ్న న్యూస్) నాచారం శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శాంతి సైజన్ శేఖర్ పాల్గొన్నారు. కాలనీలో పండుగ వాతావరణం నెలకొనగా, చిన్నారులు సైతం ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరగా బతుకమ్మకు పూజలు నిర్వహించి పండుగను భక్తిశ్రద్ధలతో ముగించారు. ఆకర్షణీయం ఉన్న బతుకమ్మలకు శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ తరపున బహుమతి అందజేశారు.

ఆర్‌కే ఎన్‌క్లేవ్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

కాప్రా (ప్రశ్న న్యూస్) సైనిక్‌పురి ఆర్‌కే ఎన్‌క్లేవ్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ జానపద గీతాలు ఆలపిస్తూ, బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని నంతరించుకుంది.మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని నైస్ డిజైన్ అధినేత రాజారావు పేర్కొన్నారు. ఐకృత, సోదరభావం, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.ఆర్‌కే ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలు స్థానికంగా పండుగ శోభను నింపాయి.

కోలాహలంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- తొమ్మిది రోజుల వేడుకలకు ఘనంగా ముగింపు

బడంగ్‌పేట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిసాయి. తొమ్మిది రోజులపాటు రకరకాల పూలతో పేర్చిన బతుకమ్మ వేడుకలు వైభవంగా సాగాయి సద్దుల బతుకమ్మ సందర్భంగా కాశీబుగ్గ శివాలయంలో మహిళలు, ఆడబిడ్డలు సంప్రదాయ చీరల్లో ముస్తాబై తంగేడు, గునుగు, బంతి, చామంతి, కట్ల పూలతో అందంగా, పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చి బతుకమ్మలతో బతుకమ్మ ఉయ్యాలో" అంటూ పాటలు పాడుతూ, చప్పట్లతో, ఆటలాడుతు సందడి చేశారు.ఈ సందర్భంగా మహిళలు ఇంటింటా తయారు చేసిన పెరుగన్నం, పులిహోర, చింతపండు అన్నం, నువ్వుల అన్నం, కొబ్బరి అన్నం వంటి ఐదు రకాల సద్దులను బతుకమ్మ ముందు పెట్టి, ఒకరికొకరు పంచుకుని ఆత్మీయతను చాటుకున్నారు. అనంతరం మహిళలంతా కలిసి బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా ఆలయంలోని కోనేరులో నిమజ్జనం చేశారు. దీంతో తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగకు ఘనంగా ముగింపు పలికారు.

చంద్రకాంతుల చెంత నర్తన కృష్ణుడు..

- వెన్నెల వెలుగుల్లో వేంకటేశుడు

- చంద్రప్రభ వాహనంపై మలయప్పస్వామి దివ్యదర్శనం

తిరుమల(ప్రశ్న న్యూస్) చల్లని చంద్రకాంతులు.. కనులవిందైన దివ్యాలంకారం.. వేణుగాన లీలలను స్ఫురింపజేసే నర్తన కృష్ణుడి రూపం.. భక్తుల గోవింద నామస్మరణల నడుమ తిరుమల కొండ ఆధ్యాత్మిక పరవశంలో మునిగిపోయింది. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు ఆదివారం రాత్రి చంద్రప్రభ వాహనంపై నర్తన కృష్ణుడి అలంకారంలో శ్రీ మలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రుని చల్లని వెన్నెల, స్వామివారి దివ్యమంగళ రూపం కలగలిసి తిరుమాడ వీధులకు ఆధ్యాత్మిక శోభను అద్దాయి.

నర్తన కృష్ణుడి రూపంలో దివ్యదర్శనం

శ్రీకృష్ణుని లీలా విన్యాసాలను గుర్తుచేసే నర్తన కృష్ణుడి అలంకారంలో స్వామివారు భక్తులను అనుగ్రహించారు. భగవంతుని దివ్యలీలలను స్మరింపజేసే ఈ రూపం భక్తుల మనసులను భక్తిభావంతో నింపింది. చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు. మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల మధ్య వాహనసేవ సాగడంతో తిరుమల వీధులు ఆధ్యాత్మిక సందడితో కళకళలాడాయి.

చంద్రప్రభ.. శాంతికి ప్రతీక..

చంద్రుని చల్లని వెన్నెల ప్రకృతికి ఆహ్లాదాన్ని, మనసుకు ప్రశాంతతను అందించినట్లే.. చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన శ్రీవారి దివ్యరూపం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచింది. హిందూ సంప్రదాయంలో చంద్రుడు శాంతికి, శీతలత్వానికి ప్రతీకగా ఆరాధించబడతాడు. ఆ చల్లని కాంతుల నడుమ స్వామివారి దర్శనం భక్తులకు ప్రశాంతమైన అనుభూతిని అందించింది.
పరమశివుని శిరస్సుపై చంద్రుడు విరాజిల్లడం, శ్రీమహావిష్ణువు వాహనసేవలో చంద్రప్రభకు ప్రాధాన్యం ఉండటం హరిహర తత్త్వ సమన్వయాన్ని గుర్తుచేస్తుందని ఆధ్యాత్మిక విశ్వాసం. చంద్రప్రభ వాహనసేవలోని ఈ విశిష్టత భక్తులకు భగవంతుని ఏకత్వ సందేశాన్ని స్ఫురింపజేసింది.ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు, సీవీఎస్వో మురళీకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.చంద్రప్రభ వాహనంపై నర్తన కృష్ణుడి అలంకారంలో విరాజిల్లిన శ్రీవారు.. భక్తుల హృదయాల్లో భక్తి భావాన్ని నింపారు. వెన్నెల వెలుగులు, గోవింద నామస్మరణలు, స్వామివారి దివ్యమంగళ రూపం కలగలిసి తిరుమల నవరాత్రి బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత ఇనుమడింపజేశాయి.

జగ్గయ్యపేట పీఠంపై కూటమి గురి

- సామినేని ఉదయభానుతో చైర్మన్ అభ్యర్థి వినిత భేటీ

జగ్గయ్యపేట(ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన నేతలు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ చేస్తున్న నరేంద్రుల వినిత ఆదివారం జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.మాజీ మున్సిపల్ చైర్మన్, సీనియర్ నాయకుడు శ్రీరాం సుబ్బారావు కుమార్తె అయిన వినిత.. ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని ఉదయభానును కోరారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు తన వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.
కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం వినిత విజ్ఞప్తిపై స్పందించిన సామినేని ఉదయభాను.. తన వంతు సహకారం పూర్తిగా అందిస్తానని హామీ ఇచ్చారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీలోని మొత్తం 36 వార్డుల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులంతా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.మున్సిపల్ ఎన్నికల వేళ కూటమి పార్టీల మధ్య సమన్వయం, పరస్పర సహకారం కీలకంగా మారాయి. చైర్మన్ అభ్యర్థి వినిత, జనసేన జిల్లా అధ్యక్షుడు ఉదయభాను భేటీతో ఎన్నికల్లో కూటమి శ్రేణుల సమష్టి కార్యాచరణకు ప్రాధాన్యం ఏర్పడింది.

సరస్ మేళాకు జనసంద్రం..

మహిళా సంఘాలకు వ్యాపార జోరు

- ఇప్పటివరకు రూ.3.50 కోట్ల వ్యాపారం

విజయవాడ(ప్రశ్న న్యూస్) కృష్ణమ్మ తీరాన జాతీయ సరస్ మేళా సందడి అంబరాన్నంటుతోంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటుండగా.. కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో పున్నమి ఘాట్‌లోని మేళా ప్రాంగణానికి సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇప్పటివరకు సుమారు రూ.3.50 కోట్ల వ్యాపారం జరిగినట్లు సెర్ప్ డైరెక్టర్ (అడ్మిన్) కళ్యాణ చక్రవర్తి వెల్లడించారు.
మహిళల ఉత్పత్తులకు దేశవ్యాప్త వేదిక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో విజయవాడ పున్నమి ఘాట్ వద్ద నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదివారం సందర్శించారు. వివిధ స్టాళ్లను పరిశీలించి, మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వ్యాపార లావాదేవీలు, సందర్శకులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఢిల్లీ వెలుపల తొలిసారిగా విజయవాడలో ఇంత భారీ స్థాయిలో జాతీయ సరస్ మేళా నిర్వహించడం గర్వకారణమన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన మహిళా స్వయం సహాయక సంఘాలకు తమ ఉత్పత్తులను ప్రదర్శించి, విక్రయించుకునేందుకు ఈ మేళా చక్కని వేదికగా నిలుస్తోందని చెప్పారు. మహిళల ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభించి, వారి ఆదాయం పెరిగేలా పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.మహిళా సాధికారతకు వేదికగా.. స్థానిక సందడికి కేంద్రంగా.. విజయవాడ సరస్ మేళా కొనుగోళ్ల కోలాహలంతో కళకళలాడుతోంది.

దర్శిలో నామినేషన్ల వేడి..

తోపులాటలో ఎస్ఐకి గాయం

- గడియారం స్తంభం వద్ద టీడీపీ, వైసీపీ శ్రేణుల భారీ గుమిగూడింపు

దర్శి(ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం దర్శిలో ఉద్రిక్తతకు దారితీసింది. నామినేషన్ల దాఖలు సందర్భంగా టీడీపీ, వైసీపీ శ్రేణులు భారీగా గుమిగూడటంతో గడియారం స్తంభం వద్ద ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. ఇరువర్గాలను అదుపు చేసే క్రమంలో జరిగిన తోపులాటలో దర్శి ఎస్ఐ ఏడుకొండలకు తలకు గాయాలయ్యాయి. ఈ ఘటనతో అక్కడ కొద్దిసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలుకు వైసీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చాయి. ఇదే సమయంలో గడియారం స్తంభం పరిసరాల్లో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడటంతో ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాల రాకతో అక్కడ రద్దీ పెరిగి పరిస్థితిని అదుపు చేయడం పోలీసులకు సవాలుగా మారింది.

తోపులాటతో పోలీసులకు ఇబ్బందులు

ఇరువర్గాల శ్రేణులను నియంత్రించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకోవడంతో ఎస్ఐ ఏడుకొండలకు తలకు గాయాలయ్యాయి. దీంతో అక్కడి పరిస్థితి మరింత ఉత్కంఠగా మారింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాల కార్యకర్తలను చెదరగొట్టారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

పూల పండుగకు శేరిలింగంపల్లి సింగారాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి(ప్రశ్న న్యూస్) పూలే దేవతలై.. ప్రకృతే పూజామందిరమై.. ఆడపడుచుల ఆటపాటలతో శేరిలింగంపల్లి నియోజకవర్గం బతుకమ్మ సంబరాల్లో మునిగిపోయింది. తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, మహిళల ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు నియోజకవర్గంలోని పలు కాలనీల్లో అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి పాటలు పాడుతూ, ఆటలాడుతూ పండుగ ఉత్సాహాన్ని చాటారు.ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శివమ్మ కాలనీ, పీజేఆర్ నగర్, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీల్లో నిర్వహించిన వేడుకలకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆడపడుచులతో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయానికి మట్టి రోడ్డే దిక్కు

అస్తవ్యస్తంగా పరిసరాలు.. అధికారుల కోసం ప్రజల నిరీక్షణ

ఆర్డీవో కోసం గంటలకొద్దీ నిరీక్షణ, విధులలో సిబ్బంది నిర్లక్ష్యం ప్రజల అసహనం

జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలి

(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)

ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే ప్రజలకు సమస్యగా ఇబ్బందులు కలిగిస్తే ఇక తమ గోడు ఎవరికి చెప్పుకోవాలి.? సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస సేవలు, సౌకర్యాలు కూడా లేకపోతే ప్రజాపాలన లక్ష్యం ఎలా నెరవేరుతుంది.? రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఆర్డీవో కార్యాలయం పరిస్థితిపై స్థానికంగా వ్యక్తమవుతున్న ఆందోళనలు

మట్టి రోడ్డుపై ప్రయాణం.. ప్రజలకు ఇబ్బందులు

ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లాలంటే మట్టి రోడ్డే దిక్కుగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే మార్గం సక్రమంగా లేకపోవడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. వర్షాలు పడితే బురద, ఇతర సమయాల్లో దుమ్ము సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో రహదారిని

మెరుగుపరచాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ఈ మార్గాన్ని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, శాశ్వత పరిష్కారం చూపాలి.

పరిసరాల నిర్వహణపై నిర్లక్ష్యమా.?

కార్యాలయ పరిసరాల్లో మొక్కలు, చెట్లు పెరిగి ఉండటం, శుభ్రత సరిగా లేకపోవడం నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజలు వివిధ పనుల కోసం వచ్చే కార్యాలయం పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాల్సిన అవసరం ఉంది. కానీ పరిసరాల నిర్వహణ సక్రమంగా లేకపోతే కార్యాలయానికి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగుతుంది. కార్యాలయ నిర్వహణకు వచ్చే నిధులు ఏమవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిసరాలను శుభ్రపరచడంతో పాటు క్రమం తప్పకుండా నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.

అధికారుల కోసం గంటల తరబడి నిరీక్షణ

ఆర్డీవో కార్యాలయంలో అధికారిని కలిసేందుకు వచ్చే ప్రజలకు నిరీక్షణ తప్పదం లేదని ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసినా అధికారి అందుబాటులోకి వస్తారా లేదా అన్న ఎలాంటి స్పష్టత లేకపోవడం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తమవుతోంది. భూములకు సంబంధించిన సమస్యలు, రెవెన్యూ వ్యవహారాలు, ఇతర ప్రభుత్వ పనుల కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు సమయం, డబ్బు ఖర్చు చేసుకుని తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడకూడదు.అధికారి అందుబాటులో ఉండే సమయాలు, ప్రజలను కలిసే విధానం, ఫిర్యాదుల స్వీకరణకు సంబంధించిన వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలి. అనివార్య కారణాలతో అధికారి అందుబాటులో లేకపోతే ప్రజలకు ముందస్తు సమాచారం అందించే విధానం ఉండాలి. అలాగే ప్రత్యామ్నాయంగా సమస్యలను స్వీకరించి సంబంధిత అధికారులకు పంపించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కానీ ఇక్కడ సిబ్బంది మాత్రం పూర్తి నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆర్డీవో ఆర్డర్లు జారీ చేసిన తర్వాత కూడా సిబ్బంది తమ వద్ద ఉంచుకొని ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

విజిటింగ్ అవర్స్ కాగితాలకే పరిమితమా.?

ప్రభుత్వ కార్యాలయాలలోమధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలను కలిసే సమయంగా పేర్కొంటున్నప్పటికీ, ఆ సమయంలో ప్రజలకు అధికారుల అందుబాటు ఎంతవరకు ఉంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విజిటింగ్ అవర్స్ ప్రకటించడం మాత్రమే కాకుండా, వాటిని ఆచరణలో అమలు చేయడం కూడా అంతే ముఖ్యం కానీ పాలకులు ఈ విధానాన్ని విస్మరించడంతో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు విజిటింగ్ సమయంలో వస్తారని తెలిసి అధికారి ఆ సమయంలో కచ్చితంగా అందుబాటులో ఉండాలి. తమ సమస్యలను అధికారికి వివరించే అవకాశం కల్పించాలి. ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలి. ఇలాంటి విధానం ఇబ్రహీంపట్నం ఆర్డిఓ కార్యాలయంలో తీసుకురావాలని ప్రజలు ముఖ్యమంత్రిని కోరుతున్నారు.

కలెక్టర్ స్పందన కోసం ప్రజల ఎదురుచూపులు

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం, అధికారులు నిర్ణీత సమయంలో అందుబాటులో ఉండేలా

చూడటం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో భాగం, కానీ ఉన్నత అధికారులు, కలెక్టర్లు ఈ పర్యవేక్షణను గాలికి వదిలేయడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయ పరిస్థితులను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.కార్యాలయానికి వెళ్లే రహదారిని అభివృద్ధి చేయడం, బీటీ రోడ్డు వేయడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, అధికారులు విజిటింగ్ అవర్స్ లో అందుబాటులో ఉండడం, విజిటింగ్ అవర్స్ను కచ్చితంగా అమలు చేయడం వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలకు సేవ చేయాల్సిన కార్యాలయంలోనే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తే సమస్యలకు పరిష్కారం ఎక్కడ.? ఈ ప్రశ్నకు అధికారులు చర్యల రూపంలో సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, లోపాలు ఉన్నట్లయితే సరిదిద్దేలా ఆదేశాలు జారీ చేయాలి. సమస్యలు కేవలం హామీలతో కాకుండా, క్షేత్రస్థాయిలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలి.ప్రజలను కార్యాలయాల చుట్టూ తింపుకునే పరిస్థితి కాకుండా, ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో సులభంగా అందేలా చూడటమే నిజమైన ప్రజాపాలన. ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయ సమస్యలపై జిల్లా యంత్రాంగం ఎప్పుడు స్పందిస్తుందో వేచి చూడాలి.

బతుకమ్మ కుంట ఏదీ.? కనీస సౌకర్యాలేవీ.?

లక్ష్మీనగర్ మహిళలకు తప్పని తిప్పలు, చీకట్లోనే బతుకమ్మ వేడుకలు

కీసర (ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేళ మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ బండ్లగూడ లక్ష్మీనగర్ కాలనీలో బతుకమ్మలు ఆడేందుకు సరైన కుంట లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పండుగ కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలోనూ విద్యుత్ దీపాలు, తగిన వెలుతురు, ఇతర కనీస సదుపాయాలు లేక మహిళలు అవస్థలు పడుతున్నారు. రాత్రివేళ చీకట్లో పాములు, విషపురుగుల ప్రమాదం పొంచి ఉండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని గొప్పలు చెప్పుకునే పాలకులు, అధికారులు క్షేత్రస్థాయిలో మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోవడంపై కాలనీవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి బతుకమ్మ కుంటను అభివృద్ధి చేయడంతోపాటు విద్యుత్ దీపాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని లక్ష్మీనగర్ మహిళలు, కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

సూర్యప్రభలో సప్తగిరీశుడు..
తిరుమాడ వీధుల్లో కళా వైభవం

సూర్యతేజంతో విరాజిల్లిన మలయప్పస్వామి

తిరుమల (ప్రశ్న న్యూస్) సప్తగిరులపై సూర్యోదయం.. సూర్యప్రభ వాహనంపై సాక్షాత్కరించిన శ్రీవేంకటేశ్వరుడు.. మరోవైపు దేశవిదేశాల కళాకారుల నృత్య నీరాజనాలు! గోవింద నామస్మరణల మధ్య తిరుమాడ వీధులు భక్తిరసంతో పులకించిపోయాయి. తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన ఆదివారం ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీ మలయప్పస్వామివారు దివ్యంగా దర్శనమివ్వగా.. 14 కళాబృందాలకు చెందిన 411 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో ఆధ్యాత్మిక శోభను అద్దారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైభవంతోపాటు అంతర్జాతీయ వేదికలపై విస్తరించిన శ్రీవారి భక్తి ప్రస్థానాన్ని ఈ వేడుక చాటిచెప్పింది.

సూర్యతేజంలో శ్రీవారి దివ్యదర్శనం

ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన సూర్యప్రభ వాహనసేవలో సూర్యమండల మధ్యవర్తిగా శ్రీ మలయప్పస్వామివారు భక్తులకు అభయప్రదానం చేశారు. సకల జీవరాశులకు చైతన్యాన్ని, ప్రకృతికి వెలుగును, జీవకోటికి శక్తిని ప్రసాదించే సూర్యభగవానుడి వైభవాన్ని ప్రతిబింబించేలా ఈ వాహనసేవ సాగింది.సూర్యప్రభ వాహనంపై విరాజిల్లుతున్న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు. మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ స్వామివారి వాహనసేవ సాగడంతో తిరుమాడ వీధులు భక్తిపారవశ్యంతో నిండిపోయాయి. సూర్యప్రభ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, భోగభాగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

దేశవిదేశాల కళలకు తిరుమల వేదిక

శ్రీవారి వాహనసేవకు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సూర్యప్రభ వాహనంపై శ్రీవారి దివ్యదర్శనం.. దేశవిదేశాల కళాకారుల నృత్య నీరాజనం.. భక్తి, సంస్కృతి, సంప్రదాయాల అపూర్వ సంగమంగా తిరుమల నవరాత్రి బ్రహ్మోత్సవాల వైభవం భక్తుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది.

జాతకం ఎంతవరకు నిజం.?

గ్రహాలపై నమ్మకం.. భవిష్యత్తుపై ఆశలు..

మనిషి జీవితాన్ని నడిపించేది జాతకమా.?

కష్టపడి చేసే ప్రయత్నమా.?

"మనిషి జీవితంలో భవిష్యత్తు గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఎప్పుడూ ఉంటుంది. రేపు ఏం జరుగుతుంది.? ఉద్యోగం వస్తుందా.? పెళ్లి ఎప్పుడు అవుతుంది.? ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయా.? ఆరోగ్యం ఎలా ఉంటుంది.? జీవితంలో అదృష్టం కలిసివస్తుందా.? ఇలాంటి ప్రశ్నలు చాలామందిని వెంటాడుతుంటాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికే క్రమంలో చాలామంది జాతకాలను, గ్రహగతులను, రాశిఫలాలను ఆశ్రయిస్తుంటారు. అయితే అసలు జాతకం ఎంతవరకు నిజం.? మన జీవితంలో జరిగే సంఘటనలను జాతకం ముందుగానే నిర్ణయిస్తుందా.? లేక మన నమ్మకం, మన ఆలోచనలు, మనం చేసే పనులే మన భవిష్యత్తును తీర్చిదిద్దుతాయా.? అనే విషయాలను ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)సాంప్రదాయ జ్యోతిష్యం ప్రకారం ఒక వ్యక్తి పుట్టిన తేదీ, సమయం, ప్రదేశాన్ని ఆధారంగా చేసుకుని గ్రహాలు, నక్షత్రాల స్థానాలను లెక్కించి జాతకాన్ని రూపొందిస్తారు. వాటి ఆధారంగా వ్యక్తి స్వభావం, వివాహం, ఉద్యోగం, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ జీవితం, భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలను అంచనా వేయడానికి ప్రయత్నిస్తారు. భారతీయ సమాజంలో జాతకానికి ఎంతోకాలంగా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా వివాహ సంబంధాలు, శుభకార్యాలు, గృహప్రవేశాలు వంటి సందర్భాల్లో చాలామంది జ్యోతిష్యాన్ని సంప్రదాయంగా అనుసరిస్తుంటారు.అయితే ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. జ్యోతిష్యం అనేది సంప్రదాయ విశ్వాసం. జాతకం ద్వారా ఒక వ్యక్తి భవిష్యత్తులో ఏమి జరుగుతుందో కచ్చితంగా ముందే తెలుసుకోవచ్చని నిరూపించే విశ్వసనీయమైన
శాస్త్రీయ ఆధారాలు ఇప్పటివరకు లేవు.

జాతకంలో చెప్పినవన్నీ నిజమవుతాయా.?

కొంతమంది తమ జాతకంలో చెప్పిన విషయాలు నిజమయ్యాయని చెబుతుంటారు. మరికొందరు జాతకం చెప్పినట్లుగా తమ జీవితంలో ఏమీ జరగలేదని అంటుంటారు. ఈ రెండు అనుభవాలూ మనకు కనిపిస్తాయి. ఒక అంచనా నిజమైనప్పుడు దానిని గుర్తుంచుకోవడం, తప్పిపోయిన అంచనాలను పట్టించుకోకపోవడం వల్ల జాతకం చాలా కచ్చితంగా పనిచేస్తోందనే భావన కలగవచ్చు.అలాగే చాలామందికి వర్తించే సాధారణ విషయాలను చెప్పినప్పుడు అవి తమ జీవితానికి సరిపోతున్నాయని అనిపించవచ్చు. ఉదాహరణకు, జీవితంలో కొంతకాలం ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని చెబితే, అప్పులు, కుటుంబ ఖర్చులు లేదా ఉద్యోగ సమస్యలు ఉన్న వ్యక్తికి ఆ మాటలు తనకే చెప్పినట్లుగా అనిపించవచ్చు.అందుకే జాతకంలో చెప్పిన ప్రతి విషయాన్ని నిజమని నమ్మడం ఎంతవరకు సరైనదో, ప్రతి ఒక్కరి అనుభవాన్ని పూర్తిగా కొట్టిపారేయడం కూడా అంతే తొందరపాటు అవుతుంది. నమ్మకానికి, నిరూపితమైన వాస్తవానికి మధ్య తేడాను అర్థం చేసుకోవాలి.

గ్రహాలు మన జీవితాన్ని నిర్ణయిస్తాయా.?

భూమి చుట్టూ, సౌర కుటుంబంలో గ్రహాలు తమ తమ కక్ష్యల్లో సంచరిస్తుంటాయి. వాటి స్థానాలను ఖగోళ శాస్త్రం ద్వారా గణించవచ్చు. అయితే గ్రహాల స్థానాల ఆధారంగా ఒక వ్యక్తి ఎప్పుడు ధనవంతుడవుతాడు, ఎప్పుడు ఉద్యోగం కోల్పోతాడు, ఎప్పుడు వివాహం జరుగుతుంది లేదా ఎప్పుడు అనారోగ్యానికి గురవుతాడు అనే విషయాలను జ్యోతిష్యం విశ్వసనీయంగా అంచనా వేస్తుందని శాస్త్రీయ పరిశోధనలు నిర్ధారించలేదు.మన జీవితంపై కుటుంబ పరిస్థితులు, విద్య, ఆరోగ్యం, ఆర్థిక వనరులు, సామాజిక వాతావరణం, వ్యక్తిగత నిర్ణయాలు, అనుకోని సంఘటనలు వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. ఈ అంశాలన్నింటినీ ఒక జాతకం ఆధారంగా కచ్చితంగా నిర్ణయించడం సాధ్యం కాదు.

జాతకాన్ని నమ్మడం తప్పా.?

జాతకాన్ని నమ్మడం వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన విషయం. కొంతమందికి జ్యోతిష్యం మానసిక ధైర్యాన్ని ఇవ్వవచ్చు. తమ సంప్రదాయాలను కొనసాగించడానికి, జీవితంలోని అనిశ్చిత పరిస్థితుల్లో ఓదార్పు పొందడానికి అది ఉపయోగపడవచ్చు.కానీ ఆ నమ్మకం భయంగా మారినప్పుడు సమస్య మొదలవుతుంది. జాతకంలో దోషం ఉందని, గ్రహాలు అనుకూలంగా లేవని, తమకు చెడు జరుగుతుందని ఎవరైనా చెప్పినప్పుడు కొందరు ఆందోళనకు గురవుతారు. మంచి ఉద్యోగం వచ్చినా చేరడానికి భయపడటం, వివాహ సంబంధాన్ని తిరస్కరించడం, అవసరమైన వైద్య చికిత్సను వాయిదా వేయడం వంటి నిర్ణయాలు తీసుకుంటే నష్టం జరిగే అవకాశం ఉంది. జాతకం ఒకరి వ్యక్తిగత నమ్మకంగా ఉండవచ్చు. కానీ అది జీవితాన్ని ఆపేసే సంకెళ్లుగా మారకూడదు.

జాతకం పేరుతో మోసపోవద్దు..

ప్రజల భయాలు, బలహీనతలను ఆసరాగా చేసుకుని కొందరు డబ్బులు సంపాదించేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. మీకు పెద్ద ప్రమాదం పొంచి ఉందని, ప్రత్యేక పూజ చేయకపోతే కుటుంబానికి కీడు జరుగుతుందని, భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందని ఎవరైనా బెదిరిస్తే అప్రమత్తంగా ఉండాలి.
పూజలు, ఆచారాలు చేయాలా వద్దా అనేది వ్యక్తిగత విశ్వాసం. అయితే భయపెట్టి డబ్బులు వసూలు చేయడం, అద్భుత ఫలితాలకు హామీ ఇవ్వడం, కుటుంబ సభ్యులపై అనుమానాలు పెంచడం వంటి చర్యలను ప్రశ్నించాలి. ఏ వ్యక్తి చెప్పినా ఆధారాలు లేకుండా నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దు.

జాతకం కంటే ప్రయత్నం ముఖ్యమా.?

ఒక విద్యార్థి జాతకంలో మంచి ఉద్యోగం వస్తుందని ఉందనుకుందాం. కానీ అతను చదవకుండా, పరీక్షలకు సిద్ధం కాకుండా ఉంటే ఉద్యోగం ఎలా వస్తుంది.? ఒక వ్యాపారి తన జాతకం బాగుందని నమ్మి సరైన ప్రణాళిక లేకుండా పెట్టుబడి పెడితే లాభం వస్తుందని హామీ ఇవ్వగలమా? ఒక వ్యక్తి ఆరోగ్యంపై శ్రద్ధ చూపకుండా జాతకం బాగుందని నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్య సమస్యలు రావని చెప్పగలమా.?
ఈ ఉదాహరణలు మనకు ఒక విషయాన్ని స్పష్టం చేస్తాయి. నమ్మకం మనిషికి ధైర్యాన్ని ఇవ్వవచ్చు. కానీ విజయానికి అవసరమైన జ్ఞానం, కృషి, ప్రణాళిక, సరైన నిర్ణయాలకు అది ప్రత్యామ్నాయం కాదు.
ఉద్యోగం కోసం నైపుణ్యాలను పెంచుకోవాలి. వ్యాపారం కోసం మార్కెట్ పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఆరోగ్యం కోసం అవసరమైన వైద్య సలహాలు పాటించాలి. కుటుంబ జీవితంలో పరస్పర గౌరవం, నమ్మకం, సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇవే మనం ఆచరణలో చేపట్టగల చర్యలు.

భవిష్యత్తు గురించి ఆలోచించాలి.. కానీ భయపడకూడదు

భవిష్యత్తు పూర్తిగా మన చేతుల్లోనే ఉందని చెప్పలేం. అనుకోని సంఘటనలు, ఇతరుల నిర్ణయాలు, ప్రకృతి పరిస్థితులు మన జీవితాలను

ప్రభావితం చేస్తాయి. అదే సమయంలో మన చేతుల్లో ఉన్న అనేక విషయాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. మనం తీసుకునే నిర్ణయాలు, అలవాట్లు, కష్టపడే విధానం, సమస్యలను ఎదుర్కొనే ధోరణి మన జీవితంపై ప్రభావం చూపుతాయి.
జాతకంలో మంచి ఉందని ప్రయత్నం మానేయకూడదు. చెడు ఉందని ముందుగానే ఓటమిని అంగీకరించకూడదు. ఎవరో చెప్పిన భవిష్యవాణి ఆధారంగా మన సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేసుకోకూడదు. తప్పులు జరిగితే వాటి నుంచి నేర్చుకోవాలి. అవకాశాలు వస్తే వాటిని ఉపయోగించుకోవాలి.

ప్రజలు ఆలోచించాల్సిన ముఖ్యాంశాలు

జాతకంలో చెప్పిన విషయాలు నిజమవుతున్నాయా లేదా అని మనం ప్రశ్నించుకోవాలి. తప్పుగా చెప్పిన అంచనాలను కూడా గుర్తుంచుకోవాలి. ముఖ్యమైన నిర్ణయాలను కేవలం రాశిఫలాలు లేదా జాతకాల ఆధారంగా కాకుండా, అందుబాటులో ఉన్న సమాచారం, వాస్తవ పరిస్థితులు, నిపుణుల సలహాల ఆధారంగా తీసుకోవాలి.ముఖ్యంగా వివాహం, ఉద్యోగం, పెట్టుబడులు, ఆరోగ్యం వంటి కీలక విషయాల్లో ఆధారాలతో కూడిన సమాచారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. జాతకంలో దోషం ఉందని ఎవరినీ తక్కువగా చూడకూడదు. ఒక వ్యక్తి విలువను అతని జాతకం నిర్ణయించదు. అతని ప్రవర్తన, బాధ్యత, నిజాయితీ, ఇతరుల పట్ల చూపే గౌరవం వంటి లక్షణాలే అతని వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588